ప్రభుత్వ నియంతృత్వ
పంజరంలో డెమోక్రసి
ప్రతిపక్షాల ప్రజల గొంతు
పట్టి నొక్కె హిపోక్రసి.

ఎన్నుకున్న విపక్షాల
ఎంపీల సస్పెండు
కలిసికట్టు ఇండియా
కదలకుంటే ముప్పు మెండు

చురక

-వేల్పుల నారాయణ
9440433475


# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 24-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:116 పేజీలు:6 వెల: రూ.1/-


## అంకుర హాస్పటల్లో భారీ అగ్ని ప్రమాదం..

హైదరాబాద్, డిసెంబర్ 23: గుడి మల్కాపూర్ లోని అంకుర్ హాస్పటల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. హాస్పటల్లోని టాప్ ఫ్లోర్ లోనూ, రూఫ్ లోనూ మంటలు ఎగిసిపడుతున్నాయి..అక్కడ నుంచి వేగంగా మంటలు కింది అంతస్తులలోకి వేగంగా విస్తరిస్తున్నాయి. ముందుగా కింద అంతస్థులలోని రోగులను బయటకు తరలిస్తున్నారు.. ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు? అయిదు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పేందుకు యత్నిస్తున్నారు.. మరోవైపు 10 అంతస్తులలో ఉన్న వైద్య సిబ్బందిని, రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్ సభ్యులు, పోలీసుల కృషి చేస్తున్నారు.. దీనిపై మరిన్ని వివరాలు అందవలసి ఉంది.

## తెలంగాణలో ముగిసిన రాష్ట్రపతి పర్యటన

-వీడ్కోలు పలికిన గవర్నర్, సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ,అధికారులు



హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ముగిసింది. శీతాకాల విడిది నిమిత్తం ఈ నెల 18న రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. నిన్న రాత్రి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఇవాళ ఉదయం హకీంపేట్‌లో రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో ఆమె ఢిల్లీ బయల్దేరారు.

## భారత్‌లో క్రమంగా పెరుగుతున్నా కరోనా వైరస్ కేసులు

-24 గంటల వ్యవధిలో కొత్తగా 756 కేసులు నమోదు
-తాజా కేసులతో దేశంలో 3,420కి పెరిగిన యాక్టివ్ కేసుల సంఖ్య
-గత 24 గంటల వ్యవధిలో మహమ్మారి కారణంగా నలుగురు మృతి

న్యూ డిల్లీ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత్‌లో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ 24 గంటల వ్యవధిలో కొత్తగా 756 కేసులు బయటపడ్డాయి. తాజా కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కి పెరిగింది. గత ఏడు నెలల్లో కేసుల సంఖ్య ఇంత చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 (ఏఊ.1) కారణమని తెలుస్తోంది. ఇక గత 24 గంటల వ్యవధిలో మహమ్మారి కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఇద్దరు కాగా, రాజస్థాన్, కర్ణాటకలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. దీంతో వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,332కి ఎగబాకింది. ఇప్పటి వరకూ దేశంలో కరోనా వైరస్ బారిన పడిన వారి సంఖ్య 4.50 కోట్లకు (4,50,07,964) చేరింది. మహమ్మారి నుంచి 4,44,71,212 మంది కోలుకున్నారు. ఇక మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా మాజీ ప్రధాని పి.వి నరసింహారావు వర్ధంతి

-పి.వి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



న్యూ డిల్లీ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శనివారం నాడు న్యూఢిల్లీ లోని తెలంగాణ భవన్లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహా రావు 19వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.. తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియం లో రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యి పి.వి నరసింహా రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ "పీవీ నరసింహారావు భారత దేశ ప్రధానిగా, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని అలాంటి పీవీ తెలంగాణలో పుట్టడం గర్వంగా భావిస్తున్నానన్నారు. చిన్ననాటి నుంచే పీవీకి దేశం అంటే చాలా ప్రేమ అని అదే విధంగా ఆయనకు అనేక భాషలపై మంచి పట్టుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా భూసంస్కరణల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మహానుభావుడు పీవీ నరసింహారావు అని అన్నారు. పీవీ నరసింహారావు ఎన్నో గొప్ప సాహస నిర్ణయాలు తీసుకున్నారు అని తెలిపారు. పీవీ పాలనా దక్షత ఇతర రాష్ట్రాలకు ఉదాహరణగా నిలిచిందని, ఆయన పాలనా అనుభవం అందరికీ స్ఫూర్తిదాయకమని, దేశం ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా పీవీ కీలక భూమిక పోషించారన్నారు. అదే విధంగా పీవీ పాలనా దక్షత అనితర సాధ్యం అని ఆయన చెప్పారు. పీవీ ఆలోచనలను, మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భవిష్యత్ తరాలు నడుం బిగించడమే, మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని" అన్నారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ భవన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ చొరబాటుకు ప్రయత్నం- ఉగ్రవాది హతం



న్యూఢిల్లీ, డిసెంబర్ 23:జమ్మూకశ్మీరులో శనివారం పాకిస్థాన్ ఉగ్రవాదుల చొరబాటుకు యత్నించారు. అఖ్నూర్ ప్రాంతంలో చొరబాటుకు ప్రయత్నించిన ఓ ఉగ్రవాదిని జవాన్లు మట్టుబెట్టారు. పాకిస్థాన్ దేశం నుంచి నలుగురు ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో భారతదేశంలోకి చొరబడేందుకు చేసిన యత్నాన్ని భారత జవాన్లు వమ్ము చేశారు. భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దు (ఐబి)లో కాపలా కాస్తున్న భద్రతా బలగాలు చొరబాటు ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. శనివారం నలుగురు ఉగ్రవాదులు అఖ్నూర్ ఖౌర్ సెక్టారులోకి చొరబడేందుకు చేసిన యత్నాన్ని భద్రతా బలగాలు విఫలం చేశాయి. పూంచ్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు ఆర్మీజవాన్లు మరణించారు. గురువారం తెల్లవారుజామున భారత జవాన్లు గాలిస్తుండగా ధాత్యార్ మోర్ వద్ద ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తామే ఈ దాడులకు పాల్పడ్డామని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ)కి చెందిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ ప్రకటించింది.

## తక్కువ దూరం ప్రయాణించే వారు పల్లె వెలుగు బస్సుల్లో ఎక్కండి

-ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించిన స్టేజీల్లో మాత్రమే ఆపడం జరుగుతుంది
-ఉచిత బస్సు ప్రయాణం చేసే మహిళలకు టీఎస్ఆర్టీసీ కీలక సూచన

హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం చేసే మహిళలకు టీఎస్ఆర్టీసీ కీలక సూచన చేసింది. తక్కువ దూరం వెళ్లాల్సిన మహిళా ప్రయాణికులు కూడా ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. దీనివల్ల దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని చెప్పారు. అందుకే తక్కువ దూరం ప్రయాణించే వారు పల్లె వెలుగు బస్సుల్లో ఎక్కి.. సిబ్బందికి సహకరించాలని కోరారు. అలాగే కొందరు మహిళలు అనుమతించిన స్టేజిల్లో కాకుండా మధ్యలోనే బస్సులు ఆపాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. దీంతో ప్రయాణ సమయం పెరిగిపోతుందని అన్నారు. అందుకే ఇకపై ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించిన స్టేజీల్లో మాత్రమే ఆపడం జరుగుతుందని తెలిపింది. దూర ప్రాంత ప్రయాణికులకు ప్రాధాన్యత ఇచ్చి సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## పదవులు ఎవరికి శాశ్వతం కాదు.. అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యం : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



సూర్యపేట, డిసెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): పదవులు ఎవరికి శాశ్వతం కాదని, అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యం అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం పెన్‌పహాడ్ మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

పశువైద్య, ఉద్యానవన, నీటి పారుదల, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, ప్రాథమిక విద్య, పౌర సరఫరా, ఆరోగ్య, రోడ్లు రహదారులతో పాటు పలు శాఖల ఆధ్వర్యంలో జరిగిన, జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత శాఖ అధికారులతో జగదీశ్ రెడ్డి సమీక్షించారు.

ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు పల్లెలు, పట్టణాలు ఎలా ఉన్నాయో, బీఆర్ఎస్ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో అధికారులే సాక్షమని అన్నారు. ప్రజా సంక్షేమవే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలన్నారు. మీరు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు భవిష్యత్తు తరాలకు చిహ్నంగా నిలబడాలని సూచించారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా అభివృద్ధి జరిగిందన్నారు. అదే తరహా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఆశిస్తునామని అన్నారు. గ్రామాల్లో జరగవలసిన పనులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి అభివృద్ధి కొనసాగించేందుకు పూర్తిగా మద్దతు తెలుపుతామని, అవసరమైతే పోరాటాలకు కూడా సిద్ధమని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ప్రభుత్వం చేపడితే తమకు పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచి పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి భాగస్వామ్యం కావాలని సర్పంచ్‌లకు సూచించారు. కేసీఆర్ ఏ విధంగా రాష్ట్రం అభివృద్ధి చేయాలని చిత్తశుద్ధితో పనిచేశారో సర్పంచులు, ప్రజాప్రలు, గ్రామాలు, వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి అని కోరారు.

ఎంపీపీ నెమ్మాధి బిక్షం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య, వైస్ ఎంపీపీ సింగా రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాతాల జానకి రామ్ రెడ్డి, వెన్న సీతారాం రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి -రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహా రెడ్డి




నిజామాబాద్, డిసెంబర్ 23:న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన ఎదుగుదల కు బార్ కౌన్సిల్ కృషి చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని పిపి గంగారెడ్డి మెమోరియల్ హాల్ లో నిర్వహించిన సెమినార్ లో ఆయన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల న్యాయ వాదులనుద్దేశించి ప్రసంగించారు. బార్ కౌన్సిల్ నిరంతర ఆలోచనల కు,ఆచరణ రూపమిచ్చి న్యాయవాదుల సంక్షేమ పథకాలకు బాటలు వేస్తున్నామని ఆయన అన్నారు. న్యాయవాదులలో న్యాయసం బంధిత విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి సెమినార్లు ప్రయోజనకారిగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

బార్ కౌన్సిల్ కు ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక వనరులు సమీకరించుకుని మరిన్ని ప్రగతి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుకుంటామని ఆయన తెలిపారు. బార్ కౌన్సిల్ వైఎస్ చైర్మన్ సునీల్ గౌడ్,బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి,కొల్లి సత్యనారాయణ, ఆనంతసేన రెడ్డి, బైరపాక జయకర్ ,కొండారెడ్డి, కిరణ్ పాలకుర్తి,రామారావు, మధుసూధన్ తమ సందేశాలను అందజేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ గిరిగీసుకుని ఉండరాదని అన్ని న్యాయసంభందిత విషయపరిజ్ఞానం సముపార్జించుకోవాలని నూతన చట్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ న్యాయవాదులు నిత్య విద్యార్థులేనని నిరంతర అధ్యయనమే వృత్తిని వృద్ధి చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల న్యాయకోవిధుల పరివారం నిజామాబాద్ జిల్లాకోర్టులో జరుగుతున్న సెమినార్ కు తరలివచ్చారని వారు వెదజల్లే న్యాయవిజ్ఞాన బాండాగారాన్ని అందిపుచ్చుకోవాలని ఆమె కోరారు. బార్ అండ్ బెంచ్ మధ్య సమన్వయం, న్యాయవిషయాలలో పరస్పర సహకారం అవసమని ఆమె అన్నారు. విశేష పరిహార చట్టం-ఆచరణాత్మక విధానాలు అనే అంశంపై కిరణ్ పాలకుర్తి వివరించారు. నేరవిచారణ-సాక్షిని ప్రతివాది న్యాయవాది ప్రశ్నించే విధానాల గూర్చి సీనియర్ హైకోర్టు న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి తెలియజేశారు.

సెమినార్ కు సమన్వయ కర్తగా బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి వ్యవహరించారు.

సెమినార్ లో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగీ చరణ్,తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ ఏసీబీ డీజీగా ఐపీఎస్ ఆఫీసర్ సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసీబీ కార్యాలయం ఉద్యోగులు, ఇతర సిబ్బంది సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రెండేండ్ల పాటు హైదరాబాద్ సీపీగా కొనసాగాను అని సీవీ ఆనంద్ తెలిపారు.

శాంతి భద్రతలను పటిష్టంగా ఉంచామని, అది వృత్తిపరంగా చాలా సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఒకేసారి అన్ని రకాల పండుగలు వచ్చినప్పటికీ, ఎక్కడా కూడా మత సామరస్యం దెబ్బతినకుండా ప్రశాంతంగా పండుగలను నిర్వహించామని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో గతంలో ఎన్నడూ చూడని నేరాలను చూశామన్నారు.

ఇక ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని సీవీ ఆనంద్ తెలిపారు. మొన్నటి వరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా కొనసాగిన సీవీ ఆనంద్‌ను.. ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఏసీబీ డీజీగా నియమించిన సంగతి తెలిసిందే.

## యువకుడిని చంపేందుకు యత్నించిన బీజేపీ నాయకుడు,మరో ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఓ యువకుడిని చంపేందుకు యత్నించిన బీజేపీ నాయకుడు ఉష్కం రఘుపతితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో ఐదు రోజుల కిందట వంశీ అనే యువకుడిపై హత్యాయత్నం జరిగింది. తన కూతురితో వంశీ సన్నిహితంగా ఉండడాన్ని గమనించిన రఘుపతి.. అతన్ని హత్య చేయించడానికి ప్రణాళిక రూపొందించాడు. పాత నేరస్థుడు రవితో రూ. 15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈనెల 18న రవి మరో వ్యక్తి అశోక్‌తో కలిసి స్కూటీపై వెళ్తున్న వంశీని వెనుక నుంచి జీపుతో ఢీకొట్టారు. దీంతో వంశీకి గాయాలయ్యాయి. వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో బీజేపీ నాయకుడు రఘుపతితో పాటు ఆయన భార్య అరుంధతి, జోహాన్ రవి, అశోక్, దిల్షాన్, రాజులపై మావల పోలీసులు కేసు నమోదు చేశారు. జోహన్ రవి, అశోక్, దిల్షాన్, రాజులను అదుపులోకి తీసుకోగా, రఘుపతి, అరుంధతి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

అనయమ్మమ్మెడి వారికి
తనివారగ లాభము నిడు దైవము కొరకై
"వినియోగదారు హక్కుల
దినము"ను జరుపంగవలయు తీపి గురుతుగన్



(డిసెంబరు 24 వినియోగదారుల హక్కుల దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210





# వినియోగదారుల హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉన్నారా..!

## (24 డిసెంబర్ "జాతీయ వినియోగదారుల దినం" సందర్భంగా)

శిశు జననం నుంచి మె?దలు తుది శ్వాస వరకు ప్రతి వ్యక్తి వినియోగదారుడే. ప్రతి ఒక్కరు తాము వెచ్చించిన డబ్బుకు తగిన వస్తువు లేదా సేవలను పొందే కనీస హక్కును కలిగి ఉ ంటారు. నేటి ఆధునిక ఆకర్షనీయ డిజిటల్ ప్రకటనల మార్కెట్ మాయాజాలంలో వినియోగదారులు మోసపోయే అవకాశాలే అధికంగా ఉన్నాయనేది వాస్తవం.

విక్రయదారుడికి, వినియోదారుడికి మధ్య ఆరోగ్యకర సంబంధం ఉన్నపుడు సమాజంలో నైతికత నెలకొంటుంది. అక్రమ వ్యాపారులు చేసే మోసాలు అపరిమితంగా వినవస్తున్నాయి, అనుభవంలోకి వస్తున్నాయి, హద్దులు మీరుతున్నాయి.

### వినియోగదారుల పరిరక్షణ చట్టాలు:

క్రయ విక్రయాల్లో అక్రమాలు, వస్తువుల్లో నాణ్యత లోపాలు, వ్యాపార మోసాలు, సేవల్లో లోపాలు లాంటివి కట్టడి చేయడానికి 24 డిసెంబర్ 1986న కేంద్ర ప్రభుత్వం రూపొందించిన "వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986"కు రాష్ట్రపతి ఆమోదం లభించిన శుభ వేళకు గుర్తుగా ప్రతి ఏట 24 డిసెంబర్‌న "జాతీయ వినియోగదారుల దినం(నేషనల్ కన్‌జ్యూమర్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. గత చట్టానికి మెరుగులు దిద్దుతూ వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019లో నిర్దిష్టంగా వినియోగదారుల రక్షణ నియమాలు-2020 సహితం చట్టంలో కల్పించబడినవి. వినియోగదారులకు హక్కులు మాత్రమే గుర్తుంటాయని, బాధ్యతలు మరిచి పోతారనే అభిప్రాయం కూడా ఉన్నది. వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే, సత్వర న్యాయం అందించే అమూల్య అవకాశం చట్టంలో కల్పించబడింది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 నుంచి 19 వరకు సూచించిన వినియోగదారుల హక్కులను దృష్టిలో పెట్టుకొని వినియోగదారుల చట్టాలను రూపొందించారు.

### వినియోగదారుల అప్రమత్తత:

వినియోగదారుల హక్కులు, పరిరక్షణ చట్టాలు, మౌళిక బాధ్యతలను చర్చించే వేదికగా "జాతీయ వినియోగదారుల దినం" ఉపయోగపడుతున్నది.

వినియోగదారుల వివాదాలను పరిష్కరిస్తూ న్యాయం కల్పించే వేదికలుగా వినియోగదారుల ఫోరమ్‌లు, వినియోగదారుల కౌన్సిల్స్ స్థానిక స్థాయి నుంచి జాతయ స్థాయి వరకు నెలకొల్పబడి ఉన్నాయని మనకు తెలుసు. వినియోగదారుడు ఖరీదు చేసిన వస్తువులో లోపాలు లేదా సేవలో అసంతృప్తులను, అక్రమ వ్యాపార ధోరిణులను అరికట్టేందుకు వినియోగదారుల చట్టాలు అవకాశాలను ఇచ్చాయి. ప్రపంచ దేశాలు ప్రతి ఏట 15 మార్చిన " ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం" కూడా పాటిస్తున్నాయి. వ్యక్తిగత ఆరోగ్యాన్ని హరించడం, వస్తు సేవల్లో లోపాల పట్ల రక్షణ పొందడం, పోటీ ప్రపంచంలో అన్ని రకాల/నాణ్యతల వస్తు వైవిధ్యం అందరికీ అందుబాటులో ఉ ంచడం, వినియోగదారుల గళానికి ఫోరమ్ బాసటగా నిలవడం, వ్యాపార మోసాలతో వినియోగదారులు నష్టపోకుండా చూడడం లాంటి ప్రయోజనాలు వినియోగదారుల హక్కులుగా ఉండాలి. వస్తు/సేవల నాణ్యత, పరిమాణం, స్వచ్ఛత, ప్రమాణాలు, కనీస ధరల సమాచారం వినియోగదారుడికి అందుబాటులోకి ఉండాలి, న్యాయంగా లభించాలి. ఆన్‌లైన్/ఈ-వ్యాపారాలు ప్రజాధరణ పొందుతున్న వేళ వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

### వినియోగదారుల బాధ్యతలు:

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాల్లో భద్రత, సమాచారం, ఎంపిక, సమస్యల వివరించడం/వినడం, వినియోగదారుల విద్య, లోపాల పరిష్కారం లాంటి ప్రధాన వినియోగదారుల హక్కులు కల్పించారు. వినియోగదారుల హక్కుల్లో భాగంగా అతి ముఖ్యమైన "సమాచార హక్కులు" కూడా పొందుపరిచారు. కోటి రూపాయల లోపు విలువగల వస్తువులు/సేవల న్యాయాన్ని కోరి జిల్లా వినియోగదారుల ఫోరమ్, రూ: 1-10 కోట్ల వరకు రాష్ట్ర ఫోరమ్, రూ: 10 కోట్లు దాటిన సందర్భంలో జాతీయ వినియోగదారుల ఫోరమ్‌లను ఆశ్రయించాల్సి వస్తుంది. వినియోగదారులకు అన్యాయం జరిగినట్లు తీర్పు వెలువడితే, వ్యాపారికి రూ: 50 లక్షల పరిహారంతో పాటు 5 ఏండ్ల వరకు జైలు శిక్ష కూడా పడవచ్చు. వ్యాపార వస్తువులు/సేవల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రతి ఒక్క వినియోగదారుడు తమ తమ హక్కులను, బాధ్యతల పట్ల అవగాహన తప్పక కలిగి ఉండాలి. మహాత్మాగాంధీ అన్నట్లు వ్యాపారరంగంలో "వినియోగదారుడే ముఖ్య వ్యక్తి అని, మనపై అతను కాదు, అతనిపై మనమే ఆధారపడ్డామని, అతని రాక మనకు వాంఛనీయమని, అతను లేకుండా వ్యాపారం ఉండదనే" విషయాలను మరిచి పోకుండా వినియోగదారుడు లేని మార్కెట్ అసాధ్యమని గమనిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# చండీఘర్ లో రూ.368 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసిన కేంద్ర హోం , సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు చండీగఢ్ లో రూ.368 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. , ఈ కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ బన్వరిలాల్ పురోహిత్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, ఈ రోజు రూ.368 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టులను ప్రారంభించామని, రూ.32 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. చండీగఢ్ ఆధునిక ఊహాశక్తితో నిర్మించిన సంపూర్ణ నగరమని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్ల పలు నగరాలు ప్రగతి పథం లో ముందుకు సాగుతున్నాయని, ఈ పోటీలో చండీఘఢ్ తనను తాను రుజువు చేసుకోవాల్సి ఉంటుందని, మొదటి స్థానాన్ని నిలుపుకోవ దానికి ఎంతో కృషి చేయాల్సి ఉంటుందని శ్రీ షా అన్నారు.

ఈ రోజు సుమారు 400 కోట్ల రూపాయల వ్యయంతో పరిశుభ్రత, విద్య, భద్రత, నివాస సౌకర్యాలు, ఉ న్నత విద్యకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని కేంద్ర హోం మంత్రి తెలిపారు. చండీగఢ్ భద్రత కోసం కొన్ని వాహనాలకు కూడా పచ్చజెండా ఊపామని, 744 మంది యువతకు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ గా నియామక పత్రాలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. చండీగఢ్ పోలీసులు క్షేత్రస్థాయిలో బీట్ అనే కాన్సెప్ట్ ను చాలా మంచి పద్ధతిలో విజయవంతంగా పునరుద్ధరి ంచారని ఆయన అన్నారు. నేడు దేశంలోని అనేక రాష్ట్రాల పోలీసులు చండీగఢ్ పోలీసులు అనుసరిస్తున్న విధానాన్ని ఎక్కువగా అనుసరిస్తూ ఈ వ్యవస్థను అంగీకరించారని ఆయన అన్నారు. పోలీసులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సవాళ్లను, ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఎదుర్కోవడానికి హ్యాకథాన్ ద్వారా యువతను భాగస్వామ్యం చేయడంపై చర్చలు జరిగాయని శ్రీ షా చెప్పారు. నేడు మొదటి, రెండు, మూడు స్థానాలు సాధించిన జట్లకు రివార్డులు ఇచ్చినట్టు చెప్పారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువత తమ పరిజ్ఞానాన్ని దేశ సమస్యల పరిష్కారానికి ఉ పయోగించేలా స్ఫూర్తిని నింపనున్నారు. సైబర్ ఆపరేషన్ అండ్ సెక్యూరిటీ సెంటర్ (సి ఇఎన్ సి ఒ పి ) ని కూడా ఇవాళ ప్రారంభించినట్లు హోంమంత్రి తెలిపారు. మూడు కొత్త క్రిమినల్ చట్టాలను పార్లమెంటు ఆమోదించిన మరుసటి రోజే చండీగఢ్ లోని సైబర్ ఆపరేషన్ అండ్ సెక్యూరిటీ సెంటర్ (సిఇఎన్ సిఒపిఎస్)లో చట్టాల అమలును కేంద్ర హోం మంత్రి సమీక్షించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో నిన్ననే దేశ పార్లమెంటు దేశంలోని క్రిమినల్ న్యాయ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చే మూడు చారిత్రాత్మక బిల్లులను చట్టంగా మార్చిందని శ్రీ అమిత్ షా తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా యావత్ దేశ న్యాయ వ్యవస్థ పనిచేయాలని ఆయన అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి మన చట్టాలు వాటికవి సిద్ధం చేసుకోవాలని, ఇందుకోసం కనెక్టివిటీ నుండి హార్డ్ వేర్ వరకు అన్ని సౌకర్యాలతో అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించాలని, తద్వారా షెడ్యూల్డ్ భాషలు ఒకదాని తో ఒకటి కమ్యూనికేట్ చేయడానికి, కనెక్ట్ కావడానికి వీలవుతుందని ఆయన అన్నారు. పోలీస్ స్టేషన్, డీజీపీ కార్యాలయం, కోర్టు, జైలు, ఎఫ్ఎస్ ఎల్, ప్రాసిక్యూటర్ కార్యాలయం, సచివాలయం ఒకదానికొకటి అనుసం ధానం అయ్యేలా పూర్తి స్థాయి న్యాయ వ్యవస్థను రూపొందించడానికి ప్రాథమిక అంశాలను ఈ చట్టాల్లో పొందుపరిచినట్లు హోంమంత్రి తెలిపారు. ఈ చట్టాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్త ంగా ఏ క్రిమినల్ కేసు పరిష్కారానికైనా మూడేళ్లకు మించి సమయం పట్టదని చెప్పారు. దీని కోసం భాగస్వా ములందరితో చాలా సంప్రదింపులు జరిపామని, ఆ తర్వాత హోం మంత్రి త్వ శాఖ స్టాండింగ్ కమిటీకి పంపి ామని శ్రీ షా చెప్పారు. సూచించిన అన్ని సవరణలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, పూర్తి చట్టాన్ని రూపొందించి పార్లమెంటులో ప్రవేశ పెట్టినట్టు వివరించారు.

సాకులు చెప్పి ఈ మూడు బిల్లులపై చర్చను బహిష్కరించాలని ప్రతిపక్షాలు దురదృష్టకర నిర్ణయం తీసుకున్నాయని కేంద్ర హోం మంత్రి అన్నారు. క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే మూడు చట్టాలపై దేశ పార్లమెంటులో చర్చ జరుగుతుంటే ప్రతిపక్ష సభ్యులు ఉ పరాష్ట్రపతిని అనుకరించే దారుణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ దేశంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయని, పోయాయని, అయితే రాజ్యాంగ పదవుల గౌరవాన్ని ఎప్పుడూ కాపాడుతున్నామని ఆయన అన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని నిలబెట్టడంలో భారతదేశంలోని ప్రకాశవంతమైన ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని ఈ రోజు మనకు బోధించే వారే తీవ్రంగా దెబ్బతీశారని, ఈ దేశ ప్రజలు ఈ విషయాలను గమనిస్తున్నారని శ్రీ షా అన్నారు. రాజ్యాంగ పదవులు దేశంలో రాజ్యాంగాన్ని అమలు చేసే వ్యవస్థలనే వాస్తవాన్ని ప్రతిపక్షాలు గుర్తించడం లేదని, అందుకే వాటిని సంస్థలు, రాజకీయాలకు అతీతంగా పరిగణిస్తున్నామని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి గౌరవానికి తామెప్పుడూ భంగం కలిగించలేదని, ఎప్పుడూ అలా జరగనివ్వలేదని హోంమంత్రి స్పష్టం చేశారు. ఈ మూడు బిల్లులను చట్టంగా మార్చే ప్రక్రియ జరుగుతుండగా రాజ్యాంగ గౌరవానికి భంగం కలిగించేలా రాజ్యాంగ పదవుల్లో ఉన్న ప్రముఖులను ప్రతిపక్షాలు అవమానిస్తున్న విషయాన్ని దేశ ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు.

2024 డిసెంబర్ నాటికి అన్ని కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ మూడు చట్టాల అమలు కోసం మౌలిక సదుపాయాలు, సాఫ్ట్ వేర్ , మానవ వనరుల శిక్షణ, కోర్టుల పూర్తి కంప్యూటరీకరణ పనులు జరుగుతా యని కేంద్ర హోం మంత్రి తెలిపారు. సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ ద్వారా మోదీ ప్రభుత్వం ఇప్పటికే ఈ పనిని ప్రారంభించిందన్నారు. ఈ చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చండీగఢ్ ను సిద్ధం చేయడానికి సవివరమైన కాలపరిమితితో కూడిన కార్యక్రమాన్ని రూపొందిస్తామని శ్రీ షా చెప్పారు. ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాల నిర్వచనాన్ని అమలు చేయడం, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఏర్పాటు, ఫోరెన్సిక్స్ కు స్థిరత్వం కల్పించడం, ఐసీజేఎస్, సీసీటీఎన్ ఎస్ లలో లొసుగులను పూడ్చడం వంటి వాటికి కాలపరిమితితో కూడిన కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. 2024 జనవరి 31 లోపు అన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి 2024 డిసెంబర్ 22 నాటికి ఈ చట్టాలను అమలు చేయడానికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని ఆయన చెప్పారు.

ఈ చట్టాలను అమలు చేయడానికి ముందే దేశంలోని 99.93 శాతం పోలీస్ స్టేషన్లను అంటే 16,733 పోలీస్ స్టేషన్లను ఆన్ లైన్ లో అనుసంధానించే పనిని మోదీ ప్రభుత్వం పూర్తి చేసిందని, అవి ఒకే సాఫ్ట్ వేర్ తో పనిచేస్తున్నాయని చెప్పారు. దేశంలోని 22 వేల కోర్టులు ఇ-కోర్టులుగా మారాయని, దేశంలోని రెండు కోట్ల మంది ఖైదీల డేటా ఇ-జైళ్ల ద్వారా, కోటికి పైగా ప్రాసిక్యూషన్ల డేటా ఇ- ప్రాసిక్యూషన్ ద్వారా ఆన్ లైన్ లో ఉందని, 17 లక్షల ఫోరెన్సిక్ వివరాలు కూడా ఇ- ఫోరెన్సిక్స్ ద్వారా ఆన్ లైన్ లో ఉన్నాయని హోం మంత్రి తెలిపారు. వీటితో పాటు 90 లక్షలకు పైగా వేలిముద్రల డేటా, ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ ఆఫ్ టెర్రరిజం (ఐఎంఓటీ), అరెస్టయిన నార్కో నేరస్తుల డేటా, నేషనల్ డేటాబేస్ ఆఫ్ హ్యూమన్ ట్రాఫికింగ్ అఫెండర్స్ డేటా ఆన్ లైన్ లో అందుబాటులో ఉ న్నాయని తెలిపారు. వీటితో పాటు క్రైమ్ మల్టీ ఏజెన్సీ సెంటర్ ను అనుసంధానం చేయడం ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, ఖైదీల బయోమెట్రిక్ డేటాను కూడా సిద్ధం చేశారు. దీని తరువాత, వారి మధ్య కమ్యూనికేషన్ భాషను నిర్ణయించడం, కమ్యూనికేషన్ సాఫ్ట్ వేర్ తీసుకురావడం, కృత్రిమ మేధస్సును ఉపయోగించి విశ్లేషించడం దేశంలో ఉగ్రవాదం , నేరాలను అరికట్టడం లక్ష్యమని తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశం తన క్రిమినల్ న్యాయ వ్యవస్థ ను భారత ఆలోచనలతో నడపడానికి కట్టుబడి ఉ ందని హోం మంత్రి అన్నారు. 19వ శతాబ్దం నుంచి 21వ శతాబ్దంలోకి దూసుకు వెళ్లేందుకు భారత క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ కూడా సిద్ధంగా ఉ ందన్నారు. ఈ చట్టాల అమలు తర్వాత మన క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునిక క్రిమినల్ జస్టిస్ వ్యవస్థగా మారుతుందని శ్రీ షా అన్నారు.

## హర్యానాలోని కురుక్షేత్రలో ఈ రోజు అంతర్జాతీయ గీతా మహోత్సవ్-2023 వేడుక

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:హర్యానాలోని కురుక్షేత్రలో ఈ రోజు అంతర్జాతీయ గీతా మహో-2023 వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'సంత్ సమ్మేళన్-2023'లో కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హర్యానా ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ లాల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ ఈ నేలపై 5 వేల సంవత్సరాల క్రితం శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుడికి గీతా ఉ పదేశించాడని. ఆ జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తంగా పునరుద్ధరించేందుకు శ్రీ జ్ఞానానంద్ జీ వంటి ఎందరో మహాత్ములు కృషి చేస్తున్నారని అన్నారు. వ్యక్తి, దేశం, యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ గీతా బోధనలోనే పరిష్కారం ఉందన్నారు. భగవానుడు శ్రీ కృష్ణుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపించడానికి మరియు అతని సందేహాలను తీర్చడానికి గీతను ఉపదేశించాడు, అయితే ఆ యుద్ధం భూమిపై హానికర మత స్థాపన హననం మరియు మొత్తం ప్రపంచ సంక్షేమానికి సంబంధించిందని అన్నారు. 2014 నుంచి దేశంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తోందని, 2014లోనే గీతా మహోత్సవ్‌కు అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకోవాలనే ఆకాంక్షను మోదీజీ వ్యక్తం చేశారని కేంద్ర హోంమంత్రి తెలిపారు. హర్యానా ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ లాల్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ హోంమంత్రి శ్రీ మనోహర్ లాల్ 2015లో ముఖ్యమంత్రి అయ్యారని, 2016లో గీతా మహోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేశారని అన్నారు. గీత సందేశం దేశంలోని, ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికి చేరాలని అన్నారు. 2014 నుండి ఈ దేశాన్ని గీతా పరంగా మేల్కొల్పడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృషి చేశారని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ దేశ గొప్ప సంస్కృతిని ఎప్పటికీ ముందుకు తీసుకెళ్లాలని, దేశ చట్టాలు, విధానాలు భారత నేల పరిమళాలను వెదజల్లాలని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎప్పటినుంచో చెబుతుందన్నారు. ఐక్యత, సమగ్రత యొక్క వాస్తవ మరియు ఖచ్చితమైన రూపాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకురావడానికి, ఆర్టికల్ 370 రద్దు చేయబడాలని మరియు కాశ్మీర్ ఎప్పటికీ భారతదేశంతో ఐక్యంగానే ఉండాలని హోం మంత్రి అన్నారు. భారతదేశం నిజమైన సెక్యులర్‌గా మారాలంటే, ఒక నిర్దిష్ట మతం కోసం రూపొందించిన ట్రిపుల్ తలాక్ వంటి చట్టాలను రద్దు చేయాల్సిందేనని ఆయన అన్నారు. శ్రీరామ జన్మభూమిలో ఆలయ నిర్మాణం దేశంలో మతపరమైన మరియు సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతీక అని శ్రీ షా అన్నారు. మోదీ నేతృత్వంలో శ్రీరామ మందిర నిర్మాణం ప్రారంభమైందని, జనవరి 22న రామాలయంలో రామ్‌లాలా ఉ ంటారని తెలిపారు. దీనితో పాటు కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాల్ మహాలోక్, సోమనాథ్ ఆలయాన్ని పాలించడం, కేదార్‌నాథ్ మరియు బద్రీనాథ్‌లలో కొత్త రూపంలో దర్శన ఏర్పాట్లు, కాశ్మీర్‌లోని శారదా పీఠం పునరుద్ధరణ, పార్లమెంటులో దక్షిణాది సనాతన సంప్రదాయ చిహ్నమైన సెంగోల్ స్థాపన వంటి పనులను ప్రధాని మోదీ చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## వెల్దుర్తి రైల్వే స్టేషన్ లో వ్యక్తి మృతి..

అమరావతి, డిసెంబర్ 23: ల్దుర్తి రైల్వే స్టేషన్ లో ఉప్పు అన్ లోడ్ జరుగుతున్న సందర్భంగా హిటాచి తగిలి అక్కడ పనిచేస్తున్న వర్కర్ సోనియా నాయక్ (40) మృతి చెంది నట్లు సమాచారం. మృతుడు బేతంచెర్ల మండలానికి చెందిన వ్యక్తి. మృతదే హాన్ని వెల్దుర్తి పోస్టుమార్టం గదిలో ఉంచారు. బయట టిప్పర్ తగిలినట్లుగా చెబుతున్నారు.. కానీ నిజాలు వెల్లడి కావాల్సి ఉంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

# నంది నాటకోత్సవాలను ప్రారంభించిన మంత్రి చెల్లుబోయిన, పోసాని



అమరావతి, డిసెంబర్ 23గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకే అవార్డులు దక్కాయని ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో నంది నాటకోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బీసీ వెల్ఫేర్, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి నాటకోత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా పోసాని మాట్లాడుతూ, నంది అవార్డుల్లో గతంలో తనకు అన్యాయం జరిగిందన్నారు. "వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక నన్ను చైర్మన్ చేశారు. అర్హులైన వారికి మాత్రమే నంది అవార్డులు ఇస్తున్నాం. కళాకారులకు గుర్తింపునిచ్చే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. నాటక రంగాన్ని అన్ని విధాలుగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం. వర్క్‌షాపులు నిర్వహించి కళాకారులకు ప్రోత్సహిం" అని పోసాని కృష్ణ మురళి పేర్కొన్నారు.

మొత్తం 73 అవార్డులు ఇవ్వబోతున్నామని, 38 నాటక సమాజాల నుంచి 1200 మంది కళాకారులు పాల్గొంటున్నారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. "నాటక కళాకారులకు అత్యుత్తమ వసతులు కల్పించాం. నిరుత్సాహంతో ఉన్న కళాకారులకు ఇది గొప్ప అవకాశం. రాష్ట్రంలో అంతరించుపోతున్న కళలను సజీవంగా ఉండాలనేది సీఎం జగన్ ఆకాంక్ష. వీధి నాటకాలను సైతం ప్రోత్సహిస్తున్నాం. వెనుకబడిన వర్గాల నుంచి ఎక్కువ మంది నాటక రంగానికి వస్తున్నారు. ప్రభుత్వం అవార్డులు ఇవ్వడం వల్ల కళాకారులకు మరింత గౌరవం దక్కుతుంది. ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇప్పుడు ఇవ్వనున్న అవార్డులు ప్రతిబింబాలు. నాటక రంగంలో ఇదొక చారిత్ర ఘట్టం" అని మంత్రి వేణు పేర్కొన్నారు.

# భారతదేశం డిజిటల్ ఆరోగ్య సేవలను ఎంచుకుంటోంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబిడిఎం)కు పెరుగుతున్న ఆదరణతో భారతదేశం తన ఆరోగ్య సంరక్షణ డెలివరీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తోంది. నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్హెచ్ఏ) ఏబిడిఎం కింద సాధించిన ప్రధాన మైలురాళ్లను ప్రకటించింది - 50 కోట్ల మంది వ్యక్తులు 'అభా' నంబర్‌ను వారి ప్రత్యేక ఆరోగ్య గుర్తింపుగా కలిగి ఉన్నారు, 1.5 కోట్ల మంది రోగులు 'అభా' ఆధారిత తక్షణ ఓపీడీ నమోదు సేవను ఉపయోగించారు. ఇంకా 50 లక్షల మందికి పైగా ప్రజలు వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్‌గా నిర్వహించడానికి 'అభా' యాప్‌ని ఉ పయోగిస్తున్నారు.

ఎన్హెచ్ఏ సీఈఓ మిషన్ పురోగతిపై మాట్లాడుతూ, "ఏబిడిఎం ప్రారంభించినప్పటి నుండి గత రెండేళ్లలో, రోగులు, హెల్త్‌కేర్ సర్వీస్ ప్రొవైడర్లు, రాష్ట్ర బృందాలు, విధాన రూపకర్తలు, హెల్త్ టెక్ ఇన్నోవేటర్లతో సహా మొత్తం పర్యావరణ వ్యవస్థ నుండి ప్రతిస్పందన చాలా ప్రోత్సాహకరంగా ఉంది. ఏబిడిఎంను స్వీకరించడానికి పరిశ్రమ నుండి సమిష్టి కృషితో, డిజిటల్ ఆరోగ్య సేవల ప్రయోజనాలను దేశంలోని మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. ఎక్కువ మంది వ్యక్తులు అభా -ఆధారిత సేవలను ఉపయోగించడం ప్రారంభించినందున, మేము ఆరోగ్య సంరక్షణను మరింత అందుబాటులోకి మరియు సమర్థవంతంగా మార్చే మా లక్ష్యానికి చేరువ అవుతాము" అని అన్నారు.

ఇప్పటి వరకు, 50 కోట్ల మంది వ్యక్తులు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా)ని వారి ప్రత్యేక ఆరోగ్య ఐడి గా కలిగి ఉన్నారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు మొదలైన ఆరోగ్య సౌకర్యాలు, బీమా కంపెనీలు, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవా ప్రదాతలు రోగుల నమోదు కోసం అభా ని ఉ పయోగిస్తున్నారు. ఇది రోగి రికార్డుల ను వారి అభా ఖాతాలతో డిజిటల్ లింక్ చేయడాన్ని మరింత ప్రారంబి ంచింది. ఇప్పటి వరకు, రోగుల అభా ఖాతాలతో 33 కోట్లకు పైగా ఆరోగ్య రికార్డులు లింక్ చేయబడ్డాయి.

రోగులు ఏదైనా ఏబిడిఎం-ప్రారంభించబడిన పిహెచ్ఆర్ యాప్ (https://abdm.gov.in/our-partners/PHR)ని ఉపయోగించి వారి మొబైల్‌లలో ఈ రికార్డులను యాక్సెస్ చేయవచ్చు. ఏబిడిఎం రిఫరెన్స్ పర్సనల్ హెల్త్ రికార్డ్స్ (పిహెచ్ఆర్) యాప్ - అభా యాప్ ఇప్పటి వరకు 50 లక్షల డౌన్‌లోడ్‌లను నమోదు చేసింది. పాత మెడికల్ ఫైల్స్, పేపర్ ఆధారిత రికార్డ్ కీపింగ్ పద్ధతుల స్థానంలో డిజిటల్ ఫార్మాట్‌లో తమ ఆరోగ్య రికార్డులను సురక్షితంగా నిర్వహించడానికి రోగులు అభా యాప్‌ని ఉపయోగిస్తున్నారు. అభా యాప్ ఆండ్రాయిడ్ అలాగే ఐఓఎస్ యూజర్‌లకు అందుబాటులో ఉంది.

ఆసుపత్రులలో తక్షణ-నమోదు సేవలను పొందడం కోసం రోగులు కూడా అభా నంబర్‌ను ఉ పయోగిస్తున్నారు. ఏబిడిఎం క్రింద ప్రారంభించబడిన స్కాన్, షేర్ సేవ రోగులకు ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఆసుపత్రులలోని ఓపీడీ కౌంటర్లు, తక్షణ రిజిస్ట్రేషన్ కోసం వారి అభా ప్రొఫైల్‌లను పంచుకునే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ సేవ దాదాపు 1.5 కోట్ల మంది రోగులకు ఓపీడీ రిజిస్ట్రేషన్‌లో గడిపిన సమయాన్ని ఆదా చేయడంలో సహాయపడింది. రోజువారీగా క్యూలు. ఆరోగ్య సౌకర్యాలు కూడా అభా ఆధారిత రిజిస్ట్రేషన్‌లతో రోగులను అలాగే రోగుల రికార్డులను మెరుగ్గా నిర్వహించగలవు.బ.

ఏబిడిఎం తప్పనిసరిగా డిజిటల్ హైవేల ద్వారా ఆరోగ్య రంగంలోని వాటాదారులందరినీ కలుపుతోంది. రోగులకు అభా నంబర్‌ల మాదిరిగానే, హెల్త్‌కేర్ సర్వీస్ ప్రొవైడర్లు కూడా ధృవీకరించబడతారు. నమోదు చేయబడుతున్నారు. ఏబిడిఎం హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ రిజిస్ట్రీలో 2.6 లక్షల మంది ధృవీకరించబడిన వైద్యులు, నర్సులు ఉన్నారు, అయితే హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీలో 2.26 లక్షల ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫార్మసీలు మొదలైనవి నమోదు చేయబడ్డాయి. ఇంకా, దేశవ్యాప్తంగా 56,000 పైగా ఆసుపత్రులు ఏబిడిఎం ఎనేబుల్డ్ సొల్యూషన్‌లను ఉపయోగిస్తున్నాయి. ఏబిడిఎం పురోగతిపై మరిన్ని గణాంకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి:

సర్వీస్ ప్రొవైడర్ స్థాయిలో డిజిటల్ హెల్త్ అడాప్షన్‌ను మరింత ప్రోత్సహించడానికి, ఎన్ఆహెచ్ఏ ప్రోత్సాహకాలను అందించే డిజిటల్ హెల్త్ ఇన్సెంటివ్ స్కీమ్ (డిహెచ్ఐఎస్)ని ప్రారంభించింది. అభా -ఆధారిత హెల్త్ రికార్డ్‌లలో సాధించిన పురోగతి ఆధారంగా సౌకర్యాలు, బీమా కంపెనీలు, ఆరోగ్య పరిష్కార ప్రదాతలకు ప్రోత్సాహకాలు ఉంటాయి.

# అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించండి..



అమరావతి, డిసెంబర్ 23అరెస్టులు తర్వాత ముందు అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని వైసీపీ ప్రభుత్వం పై టీడీపీ అధినేత చంద్రబాబు మండ్డిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీల నిరసనలను ప్రభుత్వం పట్టించు కోకపోవడం జగన్ ప్రభుత్వ అహంకార దోరణికి నిదర్శనమని దుయ్యాబట్టారు. సేవకు ప్రతిరూపంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయకపోగా న్యాయం కోసం రోడ్డెక్కిన వారి నిరసనలను అణిచివేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2014 నాటికి రూ. 4,200 వేతనం పొందుతున్న అంగన్‌వాడీలకు తమ ప్రభుత్వ హయాంలో రూ. 6,300 పెంచి రూ.10,500 చేశామని తెలిపారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు.కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరవాత అంగన్వాడీల కష్టాలు మొదలయ్యాయని వారి కష్టాలను పట్టించుకోకుండా జీతం పెంచమని కోరేవారిపై దుర్మార్గంగా వ్యవహరిస్తోంది అంటూ విమర్శించారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వారి జీతాలు పెంచలేదని..ఉన్న జీతాల చెల్లింపులు కూడా చేయలేదంటూ మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం అర్థం లేని ఆంక్షలు పెట్టి వారి సంక్షేమ పథకాలకు కోతలు పెడుతోందన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పోలీసులు, వైసీపీ నేతలు అనుసరిస్తున్న విధానం నివ్వెరపరిచిందన్నారు.

న్యాయ బద్ధమైన డిమాండ్లతో 11 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే పిలిచి మాట్లాడే ప్రయత్నం చేయకపోవడం వైసీపీ ప్రభుత్వం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లి ఎన్ఆర్ఐ యువకుడిని అరెస్టు చేయడంపై పెట్టి శ్రద్ద?అంగన్ వాడి సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వం ఎందుకు పెట్టలేకపోతుంది? అంటూ ఎన్నారై యశ్ అరెస్ట్ గురించి ప్రశ్నించారు.అనారోగ్యంతో ఉన్న తల్లి కోసం స్వదేశానికి వస్తున్న ఎన్ఆర్ఐ యువకుడు యశ్ బొద్దులూరి అరెస్టు కోసం పోలీసులను ప్రత్యేకంగా పక్క రాష్ట్రానికి పంపించి అరెస్టు చేశారంటూ మండిపడ్డారు.

## పాము కాటుకు.. పసి పాప బలి



అమరావతి, డిసెంబర్ 23:క్రిష్ణగిరి మండలం పెద్దొడ్డి గ్రామంలో బోయ రవి కూతురు చిన్నారి ఇంటిముందు ఆడుకుంటుండగా నాగుపాము కాటువేసింది. పాప అరుపులు విని అక్కడికి వెళ్లి రాయి తొలగించి చూడగా.. రెండు నాగు పాములు ఉన్నట్లు గుర్తించి.. వాటిని బంధువులు హతమార్చారు.

చంపిన రెండు పాముల్లో ఒకటి నల్ల నాగుపాము. మరొకటి తెల్ల నాగుపాము. పాపని అంబులెన్స్ లో హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించడం జరిగిందని సమాచారం. పాము కాటుతో పసిపాప మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కాశీలోని హనుమాన్ ఘాట్‌నుసందర్శించిన నిపుణుల బృందం



న్యూఢిల్లీ, డిసెంబర్ 23:'కాశీ తమిళ సంగమం' రెండో దశలో, నిపుణుల బృందం (గోదావరి) కాశీలోని హనుమాన్ ఘాట్‌ను సందర్శించింది. వారణాసిలోని వివిధ ఘాట్‌ల చరిత్ర గురించి అక్కడి పూజారులను అడిగి తెలుసుకున్నారు. ఘాట్ వద్ద ఉన్న పురాతన దేవాలయాలను సందర్శించారు. తర్వాత, హనుమాన్ ఘాట్‌లోని సుబ్రమణ్య భారతి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులతో మాట్లా డారు. కంచి మఠాన్ని కూడా సందర్శించి అక్కడి చరిత్ర గురించి తెలుసుకున్నారు. కాశీ తమిళ సంగమం రెండో దశ ఈ నెల 30 వరకు కొనసాగుతుంది. గత సంవత్సరం, కాశీ తమిళ సంగమం మొదటి దశ 2022 16 నవంబర్ నుంచి డిసెంబర్ 16 వరకు జరిగింది. ఈసారి, వివిధ వయస్సుల కు చెందిన దాదాపు 1400 మంది (ఒక్కో బృందంలో 200 చొప్పున 7 బృందాలు) తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి కాశీకి వస్తారని భావిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిపుణులతో కూడిన మొదటి మూడు బృందాలు ఇప్పటికే వారణాసికి చేరుకున్నాయి. కాశీ పర్యటనలో భాగంగా ప్రయాగ్‌రాజ్, అయోధ్యను కూడా ఆ బృందాలు సందర్శిస్తాయి.

# కరోనా ప్రబలకుండ పారద్రోలాలి-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



మెదక్, డిసెంబర్ 23: (నేటనిజం ప్రతినిధి):రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, అదేవిదంగా పారువల్లి వీధిలో గల పాత వెంకటేశ్వర స్వామి ఆలయం లో ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వైభవంగా జరుగుతుందని, ఈ పర్వదినంనా ఉత్తర ద్వారా దర్శనం ప్రత్యేకత అని అన్నారు. స్వామి దయతో రాష్ట్ర ప్రజలు అందరు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దేశం, రాష్ట్రం లో కరోనా లాంటి మహమ్మారి లు ప్రబలకుండా చూడాలని ప్రార్థించారు.. ప్రజలందరూ ఈ పర్వదినాన్ని వేడుకగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హరీష్ రావుకి ఆశీర్వాదం ఇచ్చారు. అలాగే మెదక్ పట్టణంలోని రామాలయం, వెంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. పల్లకి సేవ, ఆరాధన, కోలాటం వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఎమ్మెల్సీ శేరి రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామ స్వామి వారిని, శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డిని రామాలయ కమిటీ సాదరంగా ఆహ్వానించింది. ఎమ్మెల్సీ దంపతులను కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

# 'కోస్టల్ షిప్పింగ్ పాలసీ'కి సంబంధించి ఎంఓపిఎస్‌డబ్ల్యూ కోసం జరిగిన కన్సల్టేటివ్ కమిటీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన పార్లమెంట్ సభ్యుల పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిన్న సాయంత్రం న్యూఢిల్లీలో జరిగింది. కేంద్ర ఎంఓపిఎస్‌డబ్ల్యూ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ 'కోస్టల్ షిప్పింగ్ పాలసీ'పై జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఎంఓపిఎస్‌డబ్ల్యూ సహాయమంత్రి శ్రీ శ్రీపాద్ జ నాయక్‌తో పాటు లోక్‌సభ సభ్యులు శ్రీ అరవింద్ గణపత్ సావంత్, శ్రీ హిబీ ఈడెన్, శ్రీ లాలూభాయ్ బాబుభాయ్ పటేల్ రాజ్యసభ సభ్యులు శ్రీ జికె వాసన్ హాజరయ్యారు.

సమావేశంలో కేంద్రమంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ "జాతీయ జలమార్గాలలో కార్గో హ్యాండ్లింగ్ 2013-14లో 6.83 ఎంఎంటీ ఉండగా 2022-23లో అది 1700% కంటే ఎక్కువ పెరిగి 126.15 మిలియన్ మెట్రిక్ టన్నులకు (ఎంఎంటీ) పెరిగింది. ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ 2047 నాటికి కోస్టల్ షిప్పింగ్ ద్వారా మొత్తం 1300 ఎంటిపిఏ కార్గో తరలింపు సామర్థ్యాన్ని గుర్తించింది" అని తెలిపారు.

కోస్టల్ షిప్పింగ్‌ను ప్రోత్సహించడం కోసం ' ఎంఓపిఎస్‌డబ్ల్యూ గ్రీన్ ఛానల్ క్లియరెన్స్, ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ రోడ్ అండ్ రైల్ కనెక్టివిటీ, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ కింద ఎఫిషియెంట్ లాజిస్టిక్స్ (ఎన్‌పిఈఎల్) కోసం సెక్టోరల్ ప్లాన్‌లు మొదలైనవాటిని ప్రవేశపెట్టిందని ఆయన వెల్లడించారు.

' కోస్టల్ కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు తీరం వెంబడి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడం కోసం ప్రభుత్వం సాగరమాల కార్యక్రమం కింద వివిధ ప్రాజెక్టులను చేపట్టింది. అందులో భాగంగా ఐదు డెడికేటెడ్ కోస్టల్ బెర్త్‌లు అభివృద్ధి చేయబడ్డాయి, దీని నిర్వహణ సామర్థ్యం 6.34 ఎంటిపిఏ. అంతే కాకుండా రోరో/రోపాక్స్ జెట్టీలు, ప్యాసింజర్ జెట్టీలు మొదలైన 10 ప్రాజెక్టులు రూ. 527 కోట్ల వ్యయంతో పూర్తయ్యాయి' అని శ్రీ సోనోవాల్ అన్నారు.

అమృత్ కాల్ విజన్ కింద నిర్దేశించబడిన లక్ష్యాలు 2047 నాటికి కోస్టల్ షిప్పింగ్ ద్వారా మొత్తం 1300 ఎంటిపిఏ కార్గో తరలింపు సామర్థ్యాన్ని గుర్తించాయి.

2014-15 సంవత్సరంలో భారత ఓడరేవులు సంవత్సరానికి 74.97 మిలియన్ టన్నుల (ఎంటిపిఏ) తీరప్రాంత కార్గోను నిర్వహించాయి - 2022-23లో అది 151 ఎంటిపిఏకి (104% పెరిగింది) పెరిగింది.

జాతీయ జలమార్గాలు 2022-23లో 126.15 ఎంఎంటీ కార్గోను నిర్వహించగా, 2013-14లో 6.83 ఎంఎంటికి (1700% పెరిగింది) చేరింది.

కమోడిటీ వైజ్ షేర్- పిఓఎల్ ఉత్పత్తులు (32.3%), థర్మల్ బొగ్గు (30.6%), ఐరన్ ఓర్ (11%), ఇనుప గుళికలు (7.6%), సిమెంట్/క్లింకర్ (1.5%) మరియు ఇతరవస్తువులు (17.1%).

తీరప్రాంత నౌకలను సులభతరం చేయడానికి ఎంఓపిఎస్‌డబ్ల్యూ ప్రాధాన్యతా బెర్తింగ్ విధానాన్ని మరియు ఓడరేవుల వద్ద తీరప్రాంత కార్గోను వేగంగా తరలించడానికి గ్రీన్ ఛానల్ క్లియరెన్స్‌ను కూడా ప్రవేశపెట్టింది. తీరప్రాంత కార్గో నౌకలకు ఓడ మరియు కార్గో సంబంధిత ఛార్జీలపై ప్రధాన నౌకాశ్రయాలు 40% తగ్గింపును అందిస్తాయి. అవకాశాన్ని పరిశీలించిన తర్వాత ప్రభుత్వం భారతీయ ఫ్లాగ్ వెస్సెల్స్‌లో ఉపయోగించే బంకర్ ఇంధనాలపై జీఎస్టీని 18% నుండి 5%కి తగ్గించింది.

సముదాయ కేంద్రాల అభివృద్ధి, సిలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రత్యేక గిడ్డంగుల సౌకర్యాలు మరియు ఎండ్-టు-ఎండ్ లాజిస్టిక్స్ సరఫరా గొలుసును మెరుగుపరచడం కూడా తీరప్రాంత సిప్పింగ్‌ను మరింత ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ చేపట్టిన కార్యక్రమాలు.

జాతీయ లాజిస్టిక్స్ పాలసీ (ఎన్ఎల్‌పి) కింద కోస్టల్ షిప్పింగ్ మరియు ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ వంటి స్థిరమైన రవాణా మార్గాలను ప్రోత్సహించడం కోసం లైన్ మంత్రిత్వ శాఖలు (ఆహారం, ఎరువులు, ఉక్కు, బొగ్గు, సిమెంట్, పిఎన్‌జి మొదలైనవి) సమర్థవంతమైన లాజిస్టిక్స్ (ఎన్‌పిఈఎల్) కోసం సెక్టోరల్ ప్లాన్‌లను సిద్ధం చేస్తున్నాయి. కోస్టల్ షిప్పింగ్ ద్వారా బొగ్గు మరియు ఎరువులు వంటి కనీస కార్గో-పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌లను (పిఎస్‌యు) కూడా కేటాయించడం కూడా లాంఛనప్రాయమైంది.




# ఈశాన్య భారతంలో అభివృద్ధి పనుల అమలుపై మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సమీక్ష సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:ఈశాన్య ప్రాంతపు అభివృద్ధి శాఖ మంత్రి (ఎండీఓఎన్ఈఆర్) శ్రీ జి. కిషన్ రెడ్డి ఈరోజు ఆదే శాఖకు చెందిన సహాయ మంత్రి శ్రీ బి.ఎల్. వర్మతో కలిసి ఈశాన్య రాష్ట్రాల ముఖ్య మంత్రులతో నిర్వహించిన వర్చువల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత ఎండీఓఎన్ఈఆర్ విభాగం కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు మరియు ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆర్థిక పురోగతికి మరియు 'నవ భారత అష్టలక్ష్మి' యొక్క మొత్తం పురోగతికి ఉపయోగించని సంభావ్యతను అన్‌లాక్ చేయడం లక్ష్యంగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఎండీఓఎన్ఈఆర్ మరియు నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (ఎన్ఈసీ) పరిధిలోని చేపట్టిన వివిధ ప్రాజెక్టులు మరియు పథకాల పురోగతిని అలాగే ఇతర భారత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలును గురించి సమీక్షించారు. కొత్త ప్రాజెక్టులకు వివరాల సమర్పించాలని మరియు కొనసాగుతున్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని, పెట్టుబడి అవకాశాలను సమిష్టిగా పెంపొందించుకోవాలని, విధానాలను సమన్వయం చేయాలని, జీవనం మరియు వ్యాపారం చేయడం సౌలభ్యాన్ని మెరుగుపరచాలని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సమిష్టి కృషి ఎన్ఈఆర్ యొక్క స్వాభావిక సామర్థ్యాన్ని పొందేందుకు మరియు ప్రాంతం యొక్క అభివృద్ధిని ఉత్ప్రేరకపరచడానికి ఉద్దేశించబడిందన్నారు. ఈ ప్రాంత వేగవంతమైన అభివృద్ధికి మంత్రిత్వ శాఖ అన్నిరకాల సహాయ సహకారాలను అందజేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే "వైబ్రెంట్ గుజరాత్" కార్యక్రమంలో రాష్ట్రాలు చురుకుగా పాల్గొనాలని, ఈ ప్రాంతానికి పెట్టుబడులను ఆకర్షించడానికి తమ ఆర్థిక సామర్థ్యాన్ని మరియు పెట్టుబడి అనుకూల విధానాలను ప్రదర్శించాలని ఆయన ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రాల భాగస్వామ్యానికి ముఖ్యమంత్రులు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం అందిస్తున్న మద్దతు మరియు నిబద్ధతకు వారు గౌరవ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కొనసాగుతున్న ప్రయత్నాలు ఈ ప్రాంతం యొక్క అభివృద్ధి పట్ల భారత ప్రభుత్వపు అచంచలమైన నిబద్ధతలో భాగంగా ఉన్నాయి. ఇది వ్యూహాత్మక కార్యక్రమాలు మరియు పెట్టుబడులలో దాని నిజమైన సామర్థ్యాన్ని వెలికితీసే లక్ష్యంతో మరియు ఈశాన్య ప్రాంతం యొక్క సామాజిక-ఆర్థిక ప్రకృతి దృశ్యాన్ని మెరుగుపరుస్తుంది.

# మౌలిక సదుపాయాల సామర్థ్యాల వృద్ధిలో ప్రభుత్వం-ప్రైవేట్ రంగాల మధ్య సహకారాన్ని పెంచడానికి 'పీపీపీ బిగినర్స్ ఇ-కోర్సు'

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:మౌలిక సదుపాయాల సామర్థ్యాల వృద్ధిలో ప్రభుత్వం-ప్రైవేట్ రంగాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కీలక అడుగు పడింది. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు శ్రీ అజయ్ బంగా, 'పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) బిగినర్స్ ఇ-కోర్సు'ను ప్రారంభించారు. భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) కార్యదర్శి శ్రీ అజయ్ సేథ్, ఆర్థిక శాఖ ముఖ్య ఆర్థిక సలహాదారు డా. వి అనంత నాగేశ్వరన్, ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ పరమేశ్వరన్ అయ్యర్ సమక్షంలో, ఈ నెల 20న న్యూఢిల్లీలో ఈ కార్యక్రమం జరిగింది.



పీపీపీ ఇ-కోర్సు అనేది మౌలిక సదుపాయాల కేంద్రీకృత సామర్థ్య నిర్మాణ అభ్యాసం. డీఈఏ, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా దీనిని చేపట్టాయి. భారతదేశంలో పీపీపీ రంగాన్ని అర్థం చేసుకోవడానికి, సహకరించడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులకు ప్రాథమిక జ్ఞానం, నిపుణుల అభిప్రాయాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. దీనిలో, పీపీపీల పరిచయం, పీపీపీ ప్రాజెక్టులను గుర్తించడం, ప్రాజెక్టుల నిర్మాణం, టెండర్లు వేయడం, అమలు చేయడం, పర్యవేక్షణ అంశాలు సహా పీపీపీ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రధాన అంశాలతో కూడిన 5 మాడ్యూళ్లు ఉంటాయి. వివిధ మౌలిక రంగాల్లో పీపీపీ ప్రాజెక్టులను విజయవంతంగా రూపొందించడం, అమలు చేయడంలో ఇది సాయపడుతుంది. అవస్థాపన అనేది దేశ ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకం, ప్రభుత్వం దృష్టి పెట్టే కీలక అంశం. మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం ఉ ప్రైవేట్ రంగాలు కలిసి పనిచేయడం అవసరం. పీపీపీ ప్రాజెక్టులు సహా ఇతర అవస్థాపన కార్యక్రమాల విజయవంతానికి ప్రణాళిక, అమలు, నిర్వహణ చాలా అవసరం. ఇందుకు పటిష్టమైన సామర్థ్యం ఉండాలి. మౌలిక సదుపాయల వృద్ధిలో నిరంతరం ఎదుయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అభ్యాసం, ఆచరణ కీలకం. కాబట్టి, నిరంతరం కొనసాగే శిక్షణ కార్యక్రమాలు అవసరం.

# త్రిపురలో పట్టణ సేవలు, సౌకర్యాలు మెరుగుపరచడానికి $100 మిలియన్ రుణ ఒప్పందంపై సంతకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలోపట్టణ సేవలు, సౌకర్యాలు మెరుగుపరచడానికి కుదిరిన $100 మిలియన్ రుణ ఒప్పందంపై ఈరోజు భారత ప్రభుత్వం, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంతకాలు చేశాయి. త్రిపుర అర్బన్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కోసం కుదిరిన రుణ ఒప్పందంపై భారత ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి జూహీ ముఖర్జీ, ఆసియా అభివృద్ధి బ్యాంకు తరపున బ్యాంక్ ఇండియా రెసిడెంట్ మిషన్ ఇంచార్జ్ నిలయ మితాష్ సంతకాలు చేశారు.

ప్రాజెక్టు కింద త్రిపురలోని ప్రధాన జాతీయ రహదారుల వెంబడి ఉన్న పట్టణ స్థానిక సంస్థలలో మున్సిపల్ మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు మెరుగు పరచడానికి, కీలక పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు అమలు జరుగుతాయని శ్రీమతి జూహీ ముఖర్జీ తెలిపారు.

"ఈ ప్రాజెక్టు జాతీయ రహదారుల వెంబడి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం, మెరుగైన వనరుల సమీకరణ ,రుణ పరపతి యోగ్యత ప్రమాణాలు మెరుగు పరిచి ఆర్థిక స్థిరత్వం మెరుగుపరచడం ద్వారా ఈశాన్య ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది " అని మితాష్ చెప్పారు. " స్థానిక సంస్థల సామర్థ్యాన్ని మెరుగుపరిచి వాతావరణ, విపత్తు తట్టుకోగల ప్రణాళిక అమలు చేసి, పర్యాటక రంగంలో ప్రజలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన సహకారాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు అందిస్తుంది" అని ఆయన తెలిపారు.

ప్రాజెక్టులో భాగంగా క్ట్ 42 కిలోమీటర్ల (కిమీ) కొత్త ట్రాన్స్‌మిషన్ , డిస్ట్రిబ్యూషన్ పైపులను ఏర్పాటు చేసి పట్టణ నీటి సరఫరా వ్యవస్థలను ఆధునీకరిస్తారు. 4 కొత్త నీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు అవుతాయి. 55 కి మీ పొడవున మురుగునీటి కాలువలు నిర్మిస్తారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు, వికలాంగుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని 21 కి.మీ పట్టణ రహదారుల నిర్మాణం జరుగుతుంది.

పట్టణ ప్రాంతాల్లో వేగంగా సేవలు అందించడానికి అవసరమైన ప్రణాళిక, మౌలిక సదుపాయాల కార్యకలాపాలు మరియు నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, లింగ సమానత్వం , సామాజిక చేరిక ,ప్రాజెక్ట్ నిర్వహణపై 12 పట్టణ స్థానిక సంస్థల సామర్థ్యాన్ని ప్రాజెక్ట్ మెరుగుపరుస్తుంది, వాతావరణ, విపత్తు ప్రమాదాలు తట్టుకునేలా నిర్మాణ కార్యక్రమాలు జరిగేలా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణ నిబంధనలను నవీకరించడంలో కూడా ప్రాజెక్టు సహాయపడుతుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా చతుర్దష్ దేవత దేవాలయం, కస్బా కలిబరి, నీర్మహల్ ప్యాలెస్ వంటి పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడానికి, సౌకర్యాలు, గదులు, డిజిటల్ మ్యూజియం, అడ్వెంచర్ పార్కు లాంటి సౌకర్యాలు కల్పించి సందర్శకులను ఆకర్షించడానికి అవసరమైన చర్యలు అమలు చేయడానికి కార్యక్రమాలు అమలు చేస్తారు.

మార్కెటింగ్ సౌకరాల మెరుగుదల,ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం కోసం 10 సంవత్సరాల పాటు అమలులో ఉండే విధంగా రాష్ట్ర పర్యాటక విధానాన్ని రూపొందిస్తారు.

# ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వార దర్శనాలు - భక్తులతో కిటకిటలాడుతున్న వైష్ణవాలయాలు .

తిరుపతి, డిసెంబర్ 23:వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఎపి, తెలంగాణలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

ధనుర్మాసం శుక్లపక్షంలో వచ్చే ఈ ముక్కోటి ఏకాదశి రోజున మూడు కోట్ల మంది దేవతలు భూలోకానికి వచ్చి శ్రీమహా విష్ణువును పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శిస్తే సమస్త పుణ్యఫలపరంపరలు చేకూరతాయని భక్తుల విశ్వాసం. అందుకే, తెల్లవారుజామునే స్వామివారి దర్శనార్థం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు.



### తిరుమల గిరులలో భక్త జన ప్రభంజనం

తిరుమలలో శనివారం తెల్లవారుజామున 1.45 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి లక్షలాది భక్తులతో పాటు పలువురు ప్రముఖులు తిరుమలకు తరలివచ్చారు. వారిలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర బాబు, జస్టిస్ హిమ కోహ్లీ, జస్టిస్ ఎస్.ఎల్. భట్టి, జస్టిస్ శ్యామ్ సుందర్, జస్టిస్ తారాల రాజశేఖర్, కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణ స్వామి, ఉష శ్రీచరణ్, మేరుగు నాగార్జున, చెల్లబోయిన, అంబటి రాంబాబు, కారుమూరి, గుడివాడ అమర్నాథ్, రోజా, ఎంపీలు ప్రభాకర్‌రెడ్డి, రఘురామ కృష్ణంరాజు, సీఎం రమేశ్, ఉపసభాపతి వీరభద్ర స్వామి, తెదేపా నేత అచ్చన్నాయుడు ఉన్నారు. వారంతా ఉదయాన్ని ఉత్తర ద్వారం ద్వారా దేవదేవుడిని దర్శించుకున్నారు..

ఇక వైకుంఠ ద్వార దర్శనం 10 రోజుల పాటు టిటిడి కల్పించింది.. తొలి రోజైన నేడు స్వామి దర్శనాన్నికి కొండపైకి లక్షకు పైగా భక్తులు చేరుకున్నారు.. ముందుగా దర్శన టోకెన్లు తీసుకున్న వారికి మాత్రమే దర్శనం కల్పిస్తున్నారు.. క్యూ కాంప్లెక్ లు నిండిపోగా, బస్టాండ్ వరకూ భక్తులు క్యూలైన్ లో ఉన్నారు.. కాగా, వైకుంఠ ఏకాదశి సందర్భంగా అశేష భక్త జనం మధ్య తిరుమలేశుడు స్వర్ణరథంపై తిరుమల మాడవీధుల్లో విహరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణరథంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు.

### మహా విష్ణువు రూపంలో యాదాద్రీశ్వరుడు ..

తెలంగాణాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం 6.42 గంటలకు ఉత్తర రాజ గోపురం చెంత ఆలయ దేవుడు నారసింహుడు మహా విష్ణువు రూపంలో భక్త జనానికి దర్శనమిచ్చారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో పాల్గొని దైవ దర్శనం చేసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునేందుకు స్థానికులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వైకుంఠ ద్వారం ద్వారా దర్శనమిస్తుండటంతో భక్తుల నరసింహ నామస్మరణతో ఆలయ తిరువీధులు మార్మోగుతున్నాయి. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతున్నది.

### ధర్మపురిలో ముక్కంటికి మహా క్షీరాభిషేకం ..

తెలంగాణలోని ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామున 2.30 గంటలకు స్వామివారి మూల విరాట్లకు మహా క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దంపతులు పాల్గొని ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.

కాగా, సంగారెడ్డి వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన పల్లకి సేవలో మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులు పాల్గొన్నారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. సిరిసిల్లలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్తర ద్వారం గుండా గరుడవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయం లో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరుగుతున్నాయి. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు హరి హరులు దర్శనం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులకు స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిస్తున్నారు.

### రావణ వాహనంలో ముక్కంటి? చూసి పులకించిపోయిన భక్త జనం

శ్రీశైలం ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీశైలం మహాక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. నేడు ముక్కోటి ఏకాదశి పర్వదినం కావడంతో శ్రీ భ్రమరాంబా సమేత మల్లి కార్జునస్వామివారు రావణ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయలోని ఉత్తర ద్వారం వద్ద ఉత్తర ముఖంగా స్వామి అమ్మవార్లను రావణ వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు వేదపండితుల ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం స్వామి అమ్మవార్లు రావణ వాహనంపై ఆలయ ప్రదక్షిణ సాగుతుండగా భక్తులు భక్తి శ్రద్ధలతో రావణ వాహనంలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా, స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వెల్లువెత్తారు..

### కదిరిలో శ్రీదేవి, భూదేవిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని, శనివారం ఉత్తర గోపురం దర్శనం కై భక్తులు పోటెత్తారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కదిరి చుట్టుపక్కల గల మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు, అదేవిధంగా కర్ణాటక ప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలిరావడం కనిపించింది. శనివారం తెల్లవారుజామున 3: 30 గంటల నుంచి భక్తులకు ఆలయం ఉత్తర గోపురం దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీవారిని, శ్రీదేవి, భూదేవి సమేతంగా విశేషంగా అలంకరించి ఉత్తర గోపురం కింద విశేష రీతిలో అలంకరించి, పల్లకిపై కూర్చోబెట్టారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

# పదోన్నతులు ఇప్పించండి- మంత్రికి విన్నవించిన 2012 బ్యాచ్ ఎస్ఐలు

వరంగల్, డిసెంబర్ 23:తమ బ్యాచ్ కు చెందిన కొంతమంది ఎస్సైలకు మూడేళ్ల కిందట పదోన్నతి కల్పించారని, తమకు కూడా పదోన్నతులు కల్పించాలని 2012 బ్యాచ్ కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు విన్నవించారు. ఇవాళ మంత్రిని కలిసి 317 జీవో వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని విన్నవించారు.

తమ బ్యాచ్ కు చెందిన కొంతమందికి మూడేళ్ల కిందట పదోన్నతి లభించిందని, ఒకే బ్యాచ్ లో ఎంపికైన తమకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పాత సీనియార్టీ ప్రకారం తమకు ఎస్ఐ నుండి ఇన్స్పెక్టర్ పదోన్నతి కల్పించాలని, తమకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

తమ సమస్య విన్న మంత్రి సానుకూలంగా స్పందించారని, 2012 బ్యాచ్ సబ్ ఇన్స్పెక్టర్లకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు ఎస్సైలు పేర్కొన్నారు.

# పల్నా కింద అంగన్ వాడీ కమ్ క్రెచ్ పై సమగ్ర స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:పల్నా కింద అంగన్వాడీ కమ్ క్రెచ్ పై పథకానికి సంబంధించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేయడానికి జాతీయ స్థాయి కార్యక్రమం ఈ రోజు (డిసెంబర్ 21, 2023) న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగింది. పల్నా పథకం కింద అంగన్ వాడీ కమ్ క్రెచ్ కార్యక్రమం సవరణలకు లోనైంది. ఏప్రిల్ 2022 నుండి ప్రారంభమయ్యే మిషన్ శక్తి సహ–అమర్త్య సబ్ కాంపోనెంట్ లో భాగంగా చేర్చబడింది. నాణ్యమైన శిశు సంరక్షణ సౌకర్యాల డిమాండ్ ను తీర్చడం, మహిళలు శ్రామిక శక్తిలో చురుకుగా పాల్గొనేలా చేయడం అంగన్ వాడీ–కమ్–క్రెచ్ ల ప్రధాన లక్ష్యం.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి, మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ అధ్యక్షతన భారత ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి, ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజ్పారా మహేంద్రభాయ్ సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఇండేవర్ పాండే, భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి ఆర్తి అహూజా; భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇందర్ దీప్ సింగ్ ధరివాల్, భారత ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీమతి రాజుల్ భట్ తదితరులు క పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఓడబ్ల్యూసీడీకి చెందిన సీనియర్ అధికారులు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీవోలు, మహిళా సూపర్ వైజర్లు, అంగన్ వాడీ వర్కర్లు, పౌర సమాజ సంస్థల నిపుణులు కూడా పాల్గొన్నారు.

ఎండబ్ల్యుసిడి కార్యదర్శి ఇందేవర్ పాండే తన పరిచయ ప్రసంగంలో, శఅంగన్ వాడీ కమ్ క్రెచ్ (పల్నా) పథకం ముఖ్యంగా కుటుంబ సభ్యుల నుండి పిల్లల సంరక్షణకు మద్దతు లభించని పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంతరాన్ని వరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి సంస్థాగత మద్దతు అవసరమని పేర్కొన్నారు. పల్నా పథకం కింద ప్రస్తుతం ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు, అంగన్ వాడీ హెల్పర్లతో పాటు అదనంగా ఇద్దరు క్రెచ్ వర్కర్లు, హెల్పర్లను నియమించనున్నట్లు తెలిపారు.

2022 నాటికి శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం 37 శాతానికి పెరిగిందని భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి ఆర్తి అహూజా చెప్పారు. మహిళల భాగస్వామ్యం గ్రాఫ్ ఇప్పుడు పెరుగుతోందని, శ్రామిక శక్తిలో మహిళలకు భాగస్వామ్యాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, 2017లో చేర్చి, సవరించిన వివిధ నిబంధనల్లో మహిళా శ్రామిక భాగస్వామ్యానికి తోడ్పడాలనే ప్రభుత్వ సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది.

శ్కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇందర్ దీప్ సింగ్ ధరివాల్ మాట్లాడుతూ, సామాజిక రంగంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ( సిఎస్ఆర్) ప్రాముఖ్యతను వివరించారు. సానుకూల సామాజిక మార్పును నడిపించడంలో వ్యాపారాల సామర్థ్యాన్ని గుర్తించడం నుండి ఈ దృష్టి ఉద్భవిస్తుంది. కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాజుల్ భట్ మాట్లాడుతూ, కుటుంబ స్నేహపూర్వక పని ప్రదేశాలను పెంపొందించాల్సిన అవసరాన్ని, దేశ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యాన్ని సులభతరం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఈ సందర్భంగా పథకం సారాంశాన్ని, దాని విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అంగన్ వాడీ కమ్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ ఒ పి)ని కూడా శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ విడుదల చేశారు. ఎస్ ఒ పి పథకం నిర్వహణ, అమలు కోసం ఒక సమగ్ర ఫ్రేమ్వర్క్ ను వివరిస్తుంది, ఇందులో పరిపాలనా శ్రేణి, కార్మికుల పాత్రలు, బాధ్యతలు , మానిటరింగ్ చెక్ లిస్టు ఉన్నాయి. అంగన్ వాడీ కమ్ క్రెచ్ లు విజయవంతంగా , సమర్థవంతంగా పనిచేయడానికి, కమ్యూనిటీ మొత్తం శ్రేయస్సుకు దోహదపడటానికి ఎస్ ఒ పి గా ఒక ముఖ్యమైన సాధనంగా పనిచేస్తుంది.

డాక్టర్ ముంజ్పారా మహేంద్రభాయ్ మహిళల ఆర్థిక సాధికారతను సులభతరం చేయడంలో మంత్రిత్వ శాఖ వివిధ ప్రయత్నాలను వివరించారు.. 17000 క్రెచ్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందులో ఇప్పటి వరకు 5222 క్రెచ్ లకు ఆమోదం లభించిందని తెలిపారు. మహిళల్లో శ్రామికశక్తి భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో అంగన్ వాడీ కమ్ క్రెచ్ కీలక పాత్ర పోషిస్తుందని, తద్వారా భారత్ ఆర్థికాభివృద్ధిపై గణనీయమైన ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ మాట్లాడుతూ, మహిళలకు నాణ్యమైన శిశు సంరక్షణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు, "జీవనోపాధిని సంపాదించే మహిళ, తన సొంత ఇంటిని వదిలి వేరొక చోట పనిచేయడం, వ్యవసాయ కూలీగా పనిచేసే మహిళ, భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేసే మహిళలకు పల్నా కింద , ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనే అవకాశాన్నికల్పించడం తమ తొలి ప్రాధాన్యమ ని తద్వారా ఆమె తన జీవనోపాధితో పాటు తన పిల్లలకు సురక్షితమైన, భద్రత కలిగిన వాతావరణాన్ని అందించ గలుగుతుందని చెప్పారు. ప్రతిపాదిత 17000 శిశుగృహాలను పరిమితిగా పరిగణించవద్దని ఆమె రాష్ట్ర / జిల్లా అధికారులకు, సిఎస్ఓ ఆలోచనా నాయకులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదిత అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య కంటే ఎక్కువ తెరవాలనుకునే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని నిర్మాణ స్థలాలపై మదింపు నిర్వహించాలని, సంఘటిత, అసంఘటిత రంగంలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న పట్టణ, నగర శివారు ప్రాంతాలను మ్యాపింగ్ చేయాలని, తద్వారా శిశు గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని ఆమె రాష్ట్రాలను ఆదేశించారు.

ప్రైవేటు హోదాలో ఈ రంగంలో సేవలందించాలనుకునే వారి ద్వారా పిల్లల భద్రత, ఆరోగ్య అవసరాలు, పౌష్టికాహారాన్ని నిర్ధారించే ఈ కార్యక్రమం కోసం రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి మంత్రిత్వ శాఖ ఒక ఫ్రేమ్ వర్క్ ను అందిస్తుందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రతిపాదించారు. మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించడంలో చైల్డ్ కేర్ రంగం సామర్థ్యాన్ని ఆమె నొక్కి చెప్పారు. పిల్లలను దోపిడీ/ఉల్లంఘనలకు గురిచేసే లెక్కలు చూపని, నమోదు కాని సంస్థలను మూసివేయడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను ఆమె వివరించారు. అటువంటి సంస్థలు ఉనికిలో ఉండవని నిర్ధారించడానికి, అటువంటి సంస్థలలో పనిచేసే పురుషులకే కాకుండా మహిళలకు కూడా పోలీసు ధృవీకరణ తప్పనిసరి అని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమం రెండవ భాగంలో రెండు ప్యానెల్ చర్చలు జరిగాయి. 'కేర్ ఎకానమీ: కేర్ టు ఎంపవర్మెంట్' అనే అంశంపై జరిగిన ప్యానెల్ డిస్కషన్ పరివర్తనాత్మక సంరక్షణ విధానాలు పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు సానుకూల ఆరోగ్య, ఆర్థిక, లింగ సమానత్వ ఫలితాలను ఇవ్వగలవని ప్రముఖంగా చాటింది. ఇది మహిళల ఉపాధికి మార్గం సుగమం చేస్తుంది . కుటుంబంలో పురుషులకు సంరక్షణ పాత్రలను పెంచుతుంది. కేర్ ఎకానమీని బలోపేతం చేయడానికి దేశంలో కేర్ వర్క్ పై నైపుణ్యాలు, కోర్సులను అందించాల్సిన ఆవశ్యకతపై ప్యానెల్ చర్చించింది. సంరక్షణ పని పై అవగాహన , సంరక్షణ పనితో సంబంధం ఉన్న ఆర్థిక అవకాశాలను ఏకీకృతం చేసే లింగ సున్నితమైన విధాన సాధనాల అవసరాన్ని కూడా ఈ చర్చ స్పష్టంగా చెప్పింది. శ్రామిక శక్తిలోకి మహిళల ప్రవేశాన్ని సులభతరం చేయడానికి, వేతనం లేని సంరక్షణ , ఇంటి పనిభారాన్ని తగ్గించడానికి, వారి సంపూర్ణ శ్రేయస్సును రక్షించడానికి సమర్థవంతమైన సంరక్షణ–పని పర్యావరణ వ్యవస్థను సృష్టించడం చాలా ముఖ్యం. వేతనం లేని సంరక్షణ పని వల్ల ప్రబలమైన భారాన్ని ఎదుర్కోవటానికి సరసమైన, సులభంగా అందుబాటులో ఉన్న శిశు సంరక్షణ , వృద్ధుల సంరక్షణ సౌకర్యాలలో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ సూచనలో ఉంది. మహిళా శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు నితీశ్వర్ కుమార్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి, భారత్ లోని ఐక్యరాజ్యసమితి మహిళా కార్యాలయం డిప్యూటీ కంట్రీ రిప్రజెంటేటివ్ శ్రీమతి కాంత సింగ్, జెండర్ మెయిన్ స్ట్రీమింగ్ లో ఆర్థికవేత్త శ్రీమతి మిథాలీ నికోర్, భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) చైర్ పర్సన్ రుమ్జుమ్ ఛటర్జీ, ఫిక్కీ అదనపు సెక్రటరీ జనరల్ శ్రీమతి జ్యోతి విజ్ ప్యానెల్ డిస్కషన్ కు ప్యానలిస్టులుగా వ్యవహరించారు.

రెండో విడత ప్యానెల్ డిస్కషన్ లో 'డే కేర్ సెంటర్లు, శిశుగృహాల అమలులో జోక్యం' అనే అంశంపై చర్చించారు. ప్రభుత్వ పథకాల అభివృద్ధి ప్రక్రియ, ప్రభుత్వ కార్యక్రమాల్లో డే కేర్ సెంటర్ల సంస్థాగతీకరణ దిశగా చర్చ జరిగింది. పెద్ద ఆడపిల్లలకు ముఖ్యంగా కుమార్తెలకు విద్యలో కొనసాగింపును నిర్ధారించడానికి పాఠశాల ప్రాంగణాలకు ఆనుకొని ఉన్న శిశు గృహాలు వంటి కమ్యూనిటీ చైల్డ్ కేర్ నమూనాలపై వివిధ రాష్ట్రాల ఉత్తమ పద్ధతులను ప్యానెల్ వివరించింది. అధికారిక ఉపాధి అవకాశాల కల్పనకు కేర్ ఎకానమీ రంగంలో వృద్ధి ప్రాముఖ్యతను, అలాగే పాఠ్యప్రణాళిక, నైపుణ్య పురోగతి, ఉద్యోగ కల్పనతో సహా సహాయక మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాముఖ్యతను ప్యానలిస్ట్ నొక్కి చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా సురక్షితమైన ప్రదేశాలను ఎంచుకోవడం పిల్లల భద్రతకు మరింత భరోసా ఇస్తుంది. అదనంగా, మానసిక లేదా శారీరక వైకల్యాలు ఉన్న పిల్లల కోసం ప్రత్యేక సంరక్షణ పథకాలను ప్రతిపాదించడం ఈ సంరక్షణ వాతావరణంలో సమ్మిళితను నిర్ధారిస్తుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ప్రీతం బి.యశ్వంత్, హర్యానా ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అండ్ సెక్రటరీ శ్రీమతి అమ్నీత్ పి కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మొబైల్ క్రెచెస్ సుమిత్రా మిశ్రా, సోషల్ పాలసీ స్పెషలిస్ట్, భారతదేశానికి యునిసెఫ్ ప్రతినిధి శ్రీమతి వీణా బందోపాధ్యాయ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇండియా కంట్రీ ఆఫీస్ డైరెక్టర్ సాచి భల్లా తదితరులు డే కేర్ సెంటర్లు/క్రెచ్ ల అమలులో జోక్యంపై జరిగిన ప్యానెల్ డిస్కషన్ లో పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాలతో పంట ఉత్పత్తుల డిమాండ్లను అధ్యయనం చేయాలి

### – అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

ఖమ్మం డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పంట ఉత్పత్తులను సకాలంలో రైతుల నుంచి సేకరించి రైతులకు అండగా నిలబడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. శుక్రవారం నాడు తెలంగాణ మార్కెఫెడ్ కార్యకలాపాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఎరువుల సరఫరా, పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై మంత్రి ఆరా తీశారు. రైతులకు మద్దతు ధర వివరాలను తెలుసుకున్నారు. ఈ సమీక్షలో మార్కెఫెడ్ జనరల్ మేనేజర్, మేనేజర్ ప్రొక్యూర్మెంట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాలతో సమన్వయం చేసుకొని పంట ఉత్పత్తుల డిమాండ్లను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల మార్కెఫెడ్ నిర్వహించే కార్యకలాపాలను తెలుసుకొని విధానాలు రూప కల్పన చేయాలని చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా వినియోగం తగ్గించే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. మార్కెఫెడ్ చేపట్టే అన్ని కార్యకలాపాలు రైతులకు అండగా ఉండేలా ఉపయోగపడాలన్నారు. సంస్థ నష్టాలను తగ్గించుకొని లాభాలను గడించే విధంగా సంస్థ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# తనగంపాడు నుంచి కాంగ్రెస్ లో చేరిక




ఖమ్మం, డిసెంబర్ 23:(నేటి నిజం ప్రతినిధి): ఖమ్మం రూరల్ మండలంలోని తనగంపాడు సర్పంచ్ కేతినేని వేణు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్లో చేరారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో శనివారం వీరికి కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. హస్తం గూటికి చేరినవారిలో వార్డు సభ్యుడు ములకలపల్లి ఉపేందర్, చల్లా సంజీవరావు, చల్లా ఉపేందర్, హనుమంతరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, తిరుమలకొండ నాగరాజు, తొట్ల విజయ్, బోడ వెంకన్న, కందుకూరి వెంకటనారాయణ న్నారు.

# సైబరాబాద్ లో పెరుగుతున్న డ్రగ్ కేసులు... రూ. 232 కోట్లు కొట్టేసిన ఆన్ లైన్ కేటుగాళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 23:సైబరాబాద్ పరిధిలో గతేడాది తో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందని కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ మహంతి తెలిపారు. గతేడాది 27, 322 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 29, 156 కేసులు రిజిస్టర్ అయ్యాయి.. ఆయన చెప్పిన వివరాలు ప్రకారం ఈ ఏడాది 105 హత్య కేసులు నమోదు కాగా, సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయి.. గతేడాది 4, 850 కేసులు నమోదు కాగా 5, 342 సైబర్ క్రైమ్ కేసులు రికార్డ్ అయ్యాయి.. ఈ ఏడాది 3432 మందికి శిక్షలు ఖరారు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఇక, 5342 సైబర్ క్రైమ్ కేసులు, సైబర్ క్రైమ్ ద్వారా 232 కోట్లు మాయం అయ్యాయి.. సైబర్ క్రైమ్ లో 46 కోట్లు రికవరీ చేశాం.. 277 డ్రగ్స్ కేసులు నమోదు,567 మంది అరెస్ట్ చేశామని సీపీ వెల్లడించారు..

డ్రగ్స్ కేసుల్లో ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. 6, 676 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నాం.. డ్రగ్స్ కేసుల్లో 27 కోట్లు విలువ చేసే మత్తు పదార్థులను అదుపులోకి తీసుకున్నాం.. 52, 124 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి.. ట్రాఫిక్ ఉల్లంఘనల ద్వారా 104 కోట్ల రూపాయల చలాన్ లు విధించాం.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన 24, 318 మంది డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేశామని ఆయన చెప్పారు. షీ టీమ్స్ ద్వారా 2, 587 మంది అరెస్ట్ చేశాం.. 52 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని సీపీ తెలిపారు.

277 డ్రగ్ కేసులు –567 మంది అరెస్ట్ ..

ఈ ఏడాది 277 డ్రగ్ కేసులు నమోదు కాగా అందులో 567 మందిని అరెస్టు చేశామని సీపీ మహంతి తెలిపారు. ఇందులో ఇద్దరు సప్లయర్స్, 550 మంది పెడ్లర్స్ ఉన్నారు.. 6, 676 కిలోల గంజాయి, 13 లీటర్ల హాషిష్ ఆయిల్, 507 గ్రాముల కొకైన్, 261 గ్రాముల ఎండీఎంఏ, 120 గ్రాముల ఆల్ప్రోజోలం, 26 కిలోల ఛరస్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 52, 124 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, 1271 మంది కి శిక్ష విధించాం.. ఛలాన్ల కింద 104 కోట్ల 54 లక్షల , 12 వేల పై చిలుకు వసూలు చేశాం.. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కింద 1347 ఆపరేషన్స్ చేసి 1829 చిన్నారుల రెస్క్యూ చేశామని ఆయన వెల్లడించారు. ఇక, కేపీ చౌదరి కేసులో దర్యాప్తు కొనసాగుతుంది.. చౌదరి కన్ఫెషన్ లో అతను చెప్పిన ప్రతి ఒక్కరిని విచారిస్తున్నాం.. న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చాము.. కమర్షియల్ ఈవెంట్ కు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.. గైడ్ లైన్స్ పాటించాలి అని సీపీ అవినాస్ మహంతి పేర్కొన్నారు.

# ఏసీబీ డీజీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్



హైదరాబాద్, డిసెంబర్ 23:తెలంగాణ రాష్ట్ర ఏసీబీ డీజీగా ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లపాటు హైదరాబాద్ సీపీగా పని చేసిన ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీ డీజీగా నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన ఈ రోజు బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు ఏసీబీ కార్యాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు. రెండేళపాటు హైదరాబాద్ పోలీస్ కమిషనర్గా తాను కొనసాగానని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతలను పటిష్ఠంగా ఉంచానని పేర్కొన్నారు. అది తనకు వ్యక్తిగతంగా చాలా సంతృప్తిని ఇచ్చిందని ఆయన అన్నారు. ఒకేసారి అన్ని రకాల పండుగలు వచ్చినప్పటికీ ఎక్కడా ్యం దెబ్బతినకుండా ప్రశాంతంగా పండుగలను నిర్వహించినట్లు తెలిపారు.

## ఇంటర్నేషనల్ టైటిల్స్ను సొంతం చేసుకున్న శ్రియ గడ్డం

హైదరాబాద్, డిసెంబర్ 23:శ్రియ గడ్డం అతి చిన్న వయసులోనే ఇంటర్నేషనల్ రెండు టైటిల్స్ ను సొంతం చేసుకుంది. ఎంపవర్ మెంట్ గ్లోబల్ ఉమెన్ ఫెస్టివల్ 11వ వార్షికోత్సవం సందర్భంగామిస్ టీన్, మిస్ మిసెస్ ఇండియా డబ్ల్యుఎ యుఎస్ఎ, మిస్టర్ అండ్ మిసెస్ గ్లోబల్ ఏషియా, మిసెస్ యూనివర్స్ అమెరికా ప్రదర్శించిన పోటీల్లో పాల్గొని 'మిస్ టీన్ ఇండియా 2023, మిస్ టీన్ ఫిలాంత్రోపీ యూనివర్స్ 2023' టైటిల్ ను గెలుచుకుంది.

శ్వేత, విజయ్ గడ్డం కుమార్తె శ్రియ గడ్డం ఇంటర్నేషనల్ కమ్యూనిటీ స్కూల్ కిర్క్లాండ్ లో 8వ తరగతి చదువుతూ.. నృత్యం, నటన, మోడలింగ్, సంగీతం పట్ల శ్రియకు మక్కువతో 5సంవత్సరాల వయస్సు లోనే కళారంగాల్లో రాణించడం సంతోషదాయకమన్నారు. పోటీల్లో పాల్గొని మిస్ టీన్ ఇండియా వాషింగ్టన్ 2023, మిస్ టీన్ ఇండియా ఫిలాంత్రోపీ యూనివర్స్ 2023 అనే రెండు టైటిళ్లను గెలుచుకున్నారు. తెలుగు అమ్మాయి రెండు టైటిళ్లను గెలుచుకోవడం అభినందనీయమన్నారు. ఎంపవర్ మెంట్ గ్లోబల్ ఉమెన్ ఫెస్టివల్ సంస్థ మహిళల సాధికారత కల్పించాలనే లక్ష్యంతో యూఎస్ఏ ఆధారితంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వెంకా సోనీచే స్థాపించబడిన సంస్థ ప్రపంచ వ్యాప్తంగా లాభాపేక్ష రహితంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ప్రదర్శనకు వివిధ ప్రముఖులు, న్యాయమూర్తులు హాజరయ్యారని తెలిపారు.

## హీటర్లో చెలరేగిన మంటలు.. తండ్రి, కూతురు సజీవదహనం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:హీటర్ లో మంటలు చెలరేగడంతో తండ్రి, మూడు నెలల కూతురు సజీవ దహనమైన విషాద ఘటన రాజస్థాన్ రాష్ట్రంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్ లోని ఖైర్తాల్–తిజారా జిల్లాలో ఇవాళ గదిలోని హీటర్కి మంటలు అంటుకోవడంతో తండ్రి, మూడు నెలల కూతురు సజీవదహనమయ్యారు. ఈ ఘటనలో అతని భార్యకు గాయాలయ్యాయి. దీపక్ యాదవ్, అతని కుమార్తె మూడు నెలల నిషిక సజీవ దహనయ్యారు. దీపక్ భార్య సంజుకి కాలిన గాయాలయ్యాయి.

ఈ ఘటనలో కేకలు విన్న ఇరుగుపొరుగు వారు బాధితులను రక్షించేందుకు, మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఇద్దరి ప్రాణాలు కాపాడలేకపోయారు. తీవ్రగాయాలైన తండ్రీ, కూతుళ్లను సమీపంలోని ఆస్పత్రికి తరలించినప్పటికీ లాభం లేకపోయింది. అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరణించిన దీపక్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. చలికాలంలో ఇళ్లలో వినియోగించే హీటర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రంగనాథ స్వామిని దర్శించుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, డిసెంబర్ 23:వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని జియాగూడలో గల శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామిని ఆయన దర్శించుకున్నారు.

పూజల అనంతరం ఆయనను ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో శంకర్ యాదవ్, ఆలయ చైర్మన్ తిరువెంగలా చార్యులు, ప్రధాన అర్చకులు శేషాచార్యులు, బద్రి చార్యులు, కార్పొరేటర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిత్ర కృష్ణ, బంగారు ప్రకాష్, శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# మానవ జీవనానికి దిక్సూచి భగవద్గీత

## –పిఎస్విజి ఆద్వర్యం లో ఘనంగా శ్రీమత్ భగవద్గీత జయంతి ఉత్సవాలు

చౌటుప్పల్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) శ్రీ పాలకూర శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీమత్ భగవద్గీత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత పారాయణ ను చేసి అలరించారు. చౌటుప్పల్ లోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ మణిమాల అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సామాజిక సాహిత్య ఆధ్యాత్మికవేత్త బడుగు శ్రీరాములు విచ్చేసి ప్రసంగించారు. మానవ జీవనానికి భగవద్గీత దిక్సూచి లాంటిదని, మానవ పరిపూర్ణ వికాసానికి భగవద్గీత ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పిఎస్విజి చైర్మన్ సామాజిక కార్యకర్త సౌజన్యమూర్తి పాలకుర్లా మురళి గౌడ్ సాగుతో ఉపన్యాసం చేస్తూ దేశ విదేశాలలో ఉన్న అనేక మందిని ప్రభుత్వం చేసిన గంధం భవద్గీత అన్నారు. ప్రిన్సిపాల్ మణిమాల మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం కలిగించడానికి ఉత్తమ గ్రంథం భగవద్గీత అన్నారు. శాస్త్రవేత్తలకు ఈ గ్రంథం మార్గదర్శకం చేసిందన్నారు. అనంతరం విద్యార్థుల స్పందన వినిపించారు. భాషాపరంగా సౌశీర్య పరంగా ఈ గ్రంథం దోహదపడుతుందని విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు.

# డి ఎ వై - ఎన్ ఆర్ ఎల్ ఎం స్వయం సహాయ బృందాల కోసం రిలయన్స్ రిటైల్ కు చెందిన జియోమార్ట్ తో అవగాహన ఒప్పందం

దీన్ దయాళ్ అంత్యోదయ యోజన– జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ (డి ఎ వై–ఎన్ఆర్ఎల్ఎం) స్వయం సహాయక బృందాల (ఎస్ హెచ్ జి) ఉత్పత్తులను విస్తరించడంలో సహాయపడటానికి, గ్రామీణ ఎస్ హెచ్ జి చేతి వృత్తుల వారికి సాధికారత కల్పించడానికి రిలయన్స్ రిటైల్ కు చెందిన జియోమార్ట్ తో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్ డి ) అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది.

ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కు చెందిన గ్రామీణ జీవనోపాధి మిషన్ అదనపు కార్యదర్శి శ్రీ చరణ్ జిత్ సింగ్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం ఎస్హెచ్జిలను జియోమార్ట్లో ఇ–కామర్స్ ఫోల్డ్లో విక్రయదారులుగా చేర్చేందుకు వీలు కల్పిస్తుందని, ఈ చొరవ వల్ల ఎంఓఆర్ డి సదుపాయం మరింత పెరుగుతుందని అన్నారు. సరస్ సేకరణ పెద్ద ఎత్తున వినియోగదారులకు అందుబాటులో ఉంటుం దని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో, స్వయం సహాయక బృందాల ఉత్పత్తులకు మార్కెట్ ను విజిబిలిటీని విస్తృతం చేస్తాయని, భారతదేశం అంతటా జియోమార్ట్ వినియోగదారులకు వారి ఉత్పత్తులను అందిస్తాయని తెలిపారు. ఎం ఒ ఆర్ డి – జియోమార్ట్ మధ్య భాగస్వామ్యంలో భాగంగా, ఒకసారి చేరిక తరువాత, డి ఎ వై –ఎన్ఆర్ఎల్ఎం తో సంబంధం ఉన్న స్వయం సహాయక సంఘాల అమ్మకందారులందరూ ఆన్ లైన్ లో తమ వ్యాపారాలను పెంచుకోవడంలో ప్రయోజనాలు, మార్గదర్శకత్వాన్ని పొందుతారు.

డి ఎ వై–ఎన్ఆర్ఎల్ఎం , జియోమార్ట్ మధ్య ఈ భాగస్వామ్యం స్వయం సహాయక సంఘాల మహిళ (దీదీ) ల ఆదాయాన్ని పెంచే దిశగా మంత్రిత్వ శాఖ ప్రయత్నాలకు తోడ్పడుతుందని శ్రీ సింగ్ అన్నారు. సుస్థిర ప్రాతిపదికన స్వయం సహాయక సంఘాల ఆదాయాన్ని పెంచడానికి ఈ మిషన్ కృషి చేస్తోందని, ఈ చర్య ఆ దిశగా తమ చొరవలకు తోడ్పడుతు చెప్పారు.

స్వయం సహాయక సంఘాల జీవనోపాధి అవకాశాలను పెంచడానికి మద్దతు ఇవ్వడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని, జియోమార్ట్ తో భాగస్వామ్యం ఈ దిశలో సహాయపడుతుందని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి స్వాతి శర్మ అన్నారు.

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కు చెందిన గ్రామీణ జీవనోపాధి సంచాలకులు శ్రీ రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ ఈ అవగాహన ఒప్పందం ముఖ్య లక్ష్యాల గురించి ఒక అవలోకనాన్ని ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల బలాన్ని నేడు దేశం గుర్తించిందని, అటువంటి భాగస్వామ్యం సరస్ వంటి వివిధ మార్కెటింగ్ చొరవలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ పబ్లిక్ పాలసీ అండ్ రెగ్యులేటరీ ప్రెసిడెంట్, చీఫ్ డాక్టర్ రవిప్రకాష్ గాంధీ మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో ఫలవంతమైన సంఘాలకు ఎం ఒ ఆర్ డి భాగస్వామ్యం మొదటి అడుగు అని, ప్రభుత్వ 'మేకిన్ ఇండియా' చొరవను తాము బలంగా విశ్వసిస్తున్నామని, స్వీకరిస్తున్నా మని, ఇంకా ఈ భాగస్వామ్యం తమ నిబద్ధతను మరింత బలోపేతం చేయడానికి దోహద పడుతుందని అన్నారు. "దేశంలో డిజిటల్ రిటైల్ ఎకోసిస్టమ్ ను మార్చాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము ఈ భాగస్వామ్యం ద్వారా వృద్ధిని సాధికారం చేయాలనుకుంటున్నాము. మిలియన్ల స్వయం సహాయక సంఘాల డిజిటలైజేషన్ ను కూడా సులభతరం చేయాలనుకుంటున్నాము. ఈ చొరవ జీవితాలను మార్చడంలో, భారతదేశంలోని స్థానిక చేతివృత్తులు , చిన్న వ్యాపారుల జీవనోపాధిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను" అన్నారు.

మార్కెట్లో తమ ఖాతాను నావిగేట్ చేయడానికి, ఆపరేట్ చేయడానికి జియోమార్ట్ వారికి సహాయపడుతుందని, ఇంకా విక్రేతలు పోర్టల్ లో అమ్మకాల అనుభవాన్ని పరిచయం చేసుకోవడానికి వీలుగా ఎం ఒ ఆర్ డి ద్వారా నిర్వహించే శిక్షణలు , వర్క్ షాప్ లలో జియోమార్ట్ సంయుక్తంగా పాల్గొంటుందని తెలిపారు. స్థిరమైన వృద్ధి , వ్యాపార స్థిరత్వాన్ని నిర్ధారించడానికి, మార్కెట్లో అమ్మకందారులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడంలో సహాయపడటానికి జియోమార్ట్ ప్రారంభ అనంతర శిక్షణ, మద్దతును అందిస్తుంది. ప్లాట్ఫామ్ పై వివిధ రకాల మార్కెటింగ్ ప్రమోషన్లలో కూడా పాల్గొంటుంది.

ఈ భాగస్వామ్యం సాంప్రదాయ వస్త్రాల నుండి ప్యాంట్రీ, గృహ అలంకరణ, సౌందర్య ఉత్పత్తుల వరకు చేనేత , హస్తకళల ఉత్పత్తుల శ్రేణిని అందించే ఎం ఒ ఆర్ డి సారాస్ కలెక్షన్ బ్రాండ్ కింద స్వయం సహాయక బృందాలను జియోమార్ట్ లోకి తీసుకువస్తుంది.

దీన్ దయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డి ఎ వై – ఎన్ ఆర్ ఎల్ ఎం) గురించి:

డి ఎ వై – ఎన్ ఆర్ ఎల్ ఎం అనేది భారత ప్రభుత్వ ఒక ప్రధాన పేదరిక నిర్మూలన కార్యక్రమం. ఇది గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపరచడానికి ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమం. ఈ మిషన్ నాలుగు ప్రధాన భాగాలలో– (ఏ) గ్రామీణ పేదల స్వయం నిర్వహణ, ఆర్థికంగా సుస్థిరమైన కమ్యూనిటీ సంస్థల సామాజిక సమీకరణ, ప్రోత్సహించడం బలోపేతం చేయడం; బి) గ్రామీణ పేదల ఆర్థిక సమ్మిళితం; (సి) సుస్థిర జీవనోపాధి; (డి) సామాజిక సమ్మిళితం, సామాజిక అభివృద్ధి , సమ్మేళనం – లో పెట్టుబడి పెట్టడం ద్వారా తన లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తుంది

ఆర్ ఆర్ వి ఎల్, దాని అనుబంధ సంస్థల ద్వారా, కిరాణా, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్, ఫార్మా వినియోగ ఉత్పత్తులలో 18,040 స్టోర్లు , డిజిటల్ కామర్స్ ప్లాట్ ఫాం ల ఇంటిగ్రేటెడ్ ఓమ్ని–ఛానల్ నెట్వర్క్ ను నిర్వహిస్తుంది.

# పేద క్రైస్తవుల కోసమే క్రిస్మస్ కానుకలు

**-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**-క్రైస్తవులకు కానుకల పంపిణీ**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని



ప్రభుత్వం నుండి వచ్చిన క్రిస్మస్ కానుకలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం క్రైస్తవులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద క్రైస్తవులంతా క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ కానుకలను అందజేస్తుందన్నారు. అనంతరం క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు,శంకర్, కౌన్సిలర్ నిమశెట్టి విజయ్, సిరిగిరి చందు, జిల్లా మైనార్టీ బీఎండబ్ల్యూ సర్వర్ మియా, కాంగ్రెస్ పట్టణ,అర్బన్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు సంఘ స్వామి చిలక రమేష్, కనకరపు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజ రాజరాజేశ్వర స్వామిని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించగా, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# అభిమానం చాటుకున్న వికలాంగుడు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం మహిళా అధ్యక్షురాలు కొత్త కృష్ణవేణిపై వికలాంగుడు ఓదెల నరేష్ తన అభిమానాన్ని చాటుకున్నాడు. కొత్త కృష్ణవేణి జన్మదినాన్నిపురస్కరించుకొని శనివారం ముక్కోటి ఏకాదశి రోజు తన జన్మదినం సందర్భంగా ఆమె పేరు మీద నగరేశ్వర స్వామి ఆలయంలో అర్చన చేయించాడు. అనంతరం ఆలయం వద్ద ఉన్న వృద్ధులలు, వికలాంగులు 50 మందికి పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశాడు.

# రాజన్న ఆలయంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): : వైకుంత ఏకాదశి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిఆలయంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైకుంత(ఉత్తర) ద్వారా ఆది శ్రీనివాస్ స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరంఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొనడంతోప్రత్యేక విశేషాన్ని సంతరించుకుంది.

# ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో భేటి

అమరావతి డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఏపీలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో పొత్తుల ఖరారు, సీట్ల సర్దుబాట్లతో పాటు అధికార పార్టీని ఓడించడానికి వ్యూహరచనలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ శనివారం చంద్రబాబు తో సమావేశం కావడం హాట్ టాపిక్‌గా మారింది. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ స్వయాన ప్రశాంత్ కిషోర్‌ను తన వాహనంలో ఇంటికి తీసుకెళ్లారు. ప్రశాంత్ కిషోర్ గత ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజయానికి వ్యూహ రచన చేసి గెలిపించారు. ఆనాటి ఎన్నికల్లో వైసీపీ 151 స్థానాల్లో విజయసాధించగా టీడీపీ 23 సీట్లకే పరిమితం అయ్యింది. జనసేన పార్టీకి ఒక్క సీటు మాత్రమే దక్కింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ఒక్క సీటు కూడా గెలవలేక పోయాయి. అనంతరం జగన్, కిషోర్ మధ్య దూరం పెరగడంతో ఏపీ రాజకీయాల వైపు పీకే దృష్టిని సారించలేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరిగేందుకు అవకాశముండడంతో చంద్రబాబు, పీకే(ప్రశాంత్ కిషోర్) మధ్య భేటి ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎంత మంది పీకేలు వచ్చినా టీడీపీని బ్రతికించ లేరు : మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు

అమరావతి, డిసెంబర్ 23 ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు పీకేల( ప్రశాంత్ కిషోర్, పవన్ కల్యాణ్) వల్ల టీడీపీ బ్రతికే పరిస్థితులు లేవని ఏపీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యనించారు. చనిపోయిన టీడీపీకి పోస్టువార్టం చేయడానికి మాత్రమే రాజకీయ వ్యూహకర్త పనికొస్తారని ఎద్దేవా చేశారు. టీడీపీకి ప్రాణం పోయడానికి పనికిరాడని విమర్శించారు. శనివారం విజయవాడలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటి అయినా ప్రశాంత్ కిషోర్ విషయంపై మీడియాతో మంత్రి మాట్లాడారు.

తమ రాజకీయాల కోసం తండ్రి, కొడుకు చంద్రబాబు లోకేశ్ ఎంతటి నీచానికైనా దిగజారుతారని ఈ భేటి ఒక నిదర్శనమని అన్నారు. 2019 నాటి ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్‌ను బీహార్ డెకాయిట్ చంద్రబాబు వ్యాఖ్యనించారని గుర్తు చేశారు. 'మేటిరియల్ బాగా లేకపోతే మేస్త్రి ఏం చేస్తాడని' భేటిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఎంతమంది కట్టకట్టుకొని వచ్చినా రాబోయే ఎన్ని వ్యూహాలు రచించినా టీడీపీ గెలవడం అసాధ్యమని వెల్లడించారు. వ్యూహకర్తలు మారినంత మాత్రాన ఆ పార్టీకి ఎలాంటి మేలు జరుగదని స్పష్టం చేశారు.

# ప్రైమ్ మెరిడియన్ ఉజ్జయినీ గుండా వెళ్తుంది.. ప్రపంచ కాలాన్ని మారుస్తాం: ఎంపీ సీఎం

భోపాల్, డిసెంబర్ 23: ప్రైమ్ మెరిడియన్ ఉజ్జయినీ గుండా వెళుతుందని మధ్యప్రదేశ్ కొత్త సీఎం మోహన్ యాదవ్ (ఓజీటప్ట్రఎజీ ఖతీజీటవబష్ట్ర అఓ ఓనీప్ట్రజీని జజీటజీల) తెలిపారు. ప్రపంచ కాలాన్ని మారుస్తామని చెప్పారు. ప్రపంచ కాలానికి సూచనగా వినియోగించే రేఖాంశ రేఖ, ప్రైమ్ మెరిడియన్‌ను ఇంగ్లాండ్‌లోని గ్రీన్‌విచ్ నుంచి ఉజ్జయినీకి మార్చడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడిన సీఎం మోహన్ యాదవ్, పాశ్చాతీయకరణకు వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 300 ఏళ్ల కిందటే ప్రపంచ ప్రామాణిక సమయాన్ని భారతదేశం నిర్ణయించిందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీలో సమయాన్ని నిర్ధారించే పరికరం ఇప్పటికీ ఉందని చెప్పారు. 'భారతదేశ ప్రామాణిక సమయం దాదాపు 300 సంవత్సరాల కిందటే ప్రపంచానికి తెలుసు. అయినప్పటికీ ప్రామాణిక సమయాన్ని పారిస్ నిర్ణయించింది. ఆ తర్వాత బ్రిటీష్ వారు దీనిని అనుసరించారు. గ్రీన్‌విచ్‌ను ప్రధాన మెరిడియన్‌గా పేర్కొన్నారు' అని ఆయన అన్నారు.

కాగా, అర్ధరాత్రి 12 గంటల తర్వాత రోజు ప్రారంభం కావడాన్ని సీఎం మోహన్ యాదవ్ ప్రశ్నించారు. ఎవరూ తమ రోజును అర్ధరాత్రి నుంచి ప్రారంభించరని అన్నారు. సూర్యోదయం లేదా కొంత సమయం తర్వాత ప్రజలు మేల్కొంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ ప్రైమ్ మెరిడియన్ ఉజ్జయినీ అని నిరూపించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రపంచ సమయాన్ని సరిదిద్దే దిశగా తాము ముందుకు వెళ్తామని అన్నారు.

మరోవైపు పురాతన హిందూ ఖగోళ శాస్త్రం ప్రకారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ నగరాన్ని ఒకప్పుడు భారతదేశం సెంట్రల్ మెరిడియన్‌గా పరిగణించారు. దీంతో దేశంలోని సమయ మండలాలు, సమయ వ్యత్యాసాలను దీని ఆధారంగా నిర్ణయించినట్లు హిందూ క్యాలెండర్ ద్వారా తెలుస్తున్నది.

# కేంద్రమంత్రి గడ్కారీ బీసీలకు క్షమాపణ చెప్పాలి : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్ 23:కులగణన చేపడితే సమాజ విభజన జరుగుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ ప్రకటించడం సిగ్గుచేటని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ( డిమాండ్ చేశారు. శనివారం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన కాచిగూడలో నిర్వహించిన బీసీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్ర మంత్రి తక్షణమే 70 కోట్ల మంది బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న



తరుణంలో కులాల వారీగా జనాభా లెక్కలు తీసి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్‌పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచాలని తెలిపారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

# లక్ష్మి నరసంహస్వామి దేవాలయాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల



ఖమ్మం,డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి యాదగిరి గుట్ట లక్ష్మి నరసంహస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడు తూ... తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా పాడి,పం టలతో ,సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు.

# స్మార్ట్ కిడ్జ్‌లో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు




ఖమ్మం, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం సెమి క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేసే సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మేరీ మాత పశువుల పాకలో బాల యేసుకు జన్మనివ్వడం, దేవదూతలు గొర్రెల కాపర్లు ఆశీర్వాదాలు అందించడం, వేగుచుక్క ప్రభువు జన్మస్థానాన్ని తెలియచెప్పే సన్నివేశాలలో పాఠశాల చిన్నారులు వేషధారణలతో అబ్బురపరిచారు. మేరీ మాత, శాంతా క్లాజ్, క్రిస్మస్ ట్రీ, దేవదూతలు, గొర్రెల కాపరుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ...ఏసుప్రభువు జన్మదినం క్రిస్మస్ ప్రపంచానికే పెద్ద పర్వదినం అని కరుణామయుని బోధనలు అందరికీ మార్గదర్శకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బకెట్ బిర్యాని ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసినటువంటి గ్రీన్ బకెట్ బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్ ను శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ బకెట్ నిర్వాహకులు పట్టణ ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. రాబోయే రోజుల్లో వ్యాపారం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అనంతరం గ్రీన్ బకెట్ బిర్యానీ ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ అర్బన్, పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు, పులి రాంబాబు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం పథకంపై విచారణ జరిపించాలి

**– రేవంత్ సర్కారుకు "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి**

హైదరాబాద్, డిసెంబర్ –23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గత సర్కారు పథకాల వైఫల్యాలపై రేవంత్ రెడ్డి సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకున్న "హరిత హారం పథకం పై" పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. వందల కోట్ల మొక్కలు నాటామని చెప్పుకున్న బీ ఆర్ ఎస్ సర్కారు ఆ స్థాయిలో మొక్కలు నాటి సంరక్షించిన దాఖలా కనిపించడం లేదని, హరిత హారంలో వేలాదిగా పంపిణీ చేసిన మొక్కలు ఆయా పార్కుల్లో, చనిపోయాయని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య శనివారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. గడ్డి మొక్కలు కూడా హరిత హారం మొక్కల లెక్కల్లో చూపారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో హరితహారం పథకం నిజానిజాలు నిగ్గుతేల్చాలని రంగయ్య కోరారు. నిజానికి హరిత హారం లో చెప్పినట్లు కోట్లాది మొక్కలు నాటి ఉంటే పర్యావరణానికి మరింత మేలు జరిగుండేదని, కాని క్షేత్ర స్థాయిలో అది జరగలేదని ఆయన పేర్కొన్నారు. హరితహారం కోసం ఖర్చు చేసిన నిధులు, జరిగిన ప్రయోజనం పై ఒక కమిటీ వేసి విచారణ చేపట్టాలని తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మధుయాష్కీ గౌడ్ సమావేశం



ఖమ్మం, డిసెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ డా.బీ ఆర్ అంబెడ్కర్ సెక్రటేరియట్ లో సమావేశం అయ్యారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసిరివ్యూ మీటింగ్ ఏర్పాటు మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, కంటెస్టడ్ కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.